J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 46 సంచిక : 3 19.6.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## జయహో మోడీ..

# పాలనకు పుష్కరం.. సంస్కరణలు పుష్కలం!



### ఏకధాటిగా పన్నెండేళ్ళకి పైగా పాలించిన ప్రధానిగా రికార్డు

- విదేశీ విధానం, దేశ భద్రతలో తనదైన మార్క్
- నేషన్ ఫస్ట్ నినాదంతో పాలనలో పరుగులు
- పుష్కర కాలంలో భారీగా సంస్కరణలు

ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదు, అయినా దశాబ్దాలుగా రాజకీయాల్లో తలపండిన కుటుంబాలకు ఆయన సింహస్వప్నం. పెద్దగా చదువుకున్నది కూడా లేదు. కానీ దేశ దిశాదశను నిర్ణయించే కొత్త పన్ను విధానంతో ఆర్థిక స్వరూపాన్నే మార్చగలిగే సత్తా ఆయన సొంతం. ఇంకా చెప్పాలంటే నా అనే బంధానికి ఆయన ఆమడదూరం. అందుకే ఆయనకు ఎలాంటి మోహమాటాలు ఉండవు. సిఫారసులంటే అసలు నచ్చవు. ఒక్కమాటలో చెప్పాలంటే భయంలేని, బెరుకులేని నేత, అవినీతి మరక అంటనినేత. యుద్ధోన్మాదం లేని శాంతిదూత. ఆయనే ఒన్ అండ్ ఓన్లీ నరేంద్ర దామోదర్ దాస్ మోడీ. ప్రధానిగా దేశాన్ని అత్యధిక కాలం పాలించిన ఘనతను సొంతం చేసుకున్న నాయకుడు.

2లో


## నెల్లూరు నగర కార్పొరేషన్ వార్డుల పునర్విభజనకి..

# హైకోర్టు బ్రేక్..!

ప్రక్రియ నిలిపేయాలంటూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన న్యాయస్థానం



3లో



# పాలనకు పుష్కరం.. సంస్కరణలు పుష్కలం!

(మొదటిపేజీ తరువాయి)

75 ఏళ్ల వయస్సులోనూ మొక్కవోని దీక్షతో దేశాభివృద్ధికి నిత్యం శ్రమిస్తున్నారు. అన్ని వర్గాలూ, అన్ని వయస్సుల వారినీ ఆకట్టుకుంటూ దేశ్కే నేతగా, సమ్మోహన శక్తిగా దూసుకెళ్తున్నారు.

## మోడీ ప్రస్థానం అనితరసాధ్యం, అనన్యసామాన్యం...!

గుజరాత్‌లో పుట్టి, చిన్నప్పటినుంచి ఆర్‌ఎస్‌ఎస్‌లో రాటుదేలి, వాజ్‌పేయ్, ఎల్‌కే అద్వానీ వంటి ఉద్దండుల మార్గనిర్దేశనంలో దినదిన ప్రవర్ధమానం చెందారు మోడీ. భారతీయ జనతాపార్టీలో ఇంతింతై వటుడింతై అన్నట్లుగా అంచెలంచెలుగా ఎదిగారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా కమలం పార్టీ అవకాశం కల్పించడంతో తనదైన శైలిలో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌-1గా నిలిపి ప్రశంసలందుకున్నారు. అదే పట్టుదలతో వరుసగా మూడు సార్లు సీఎంగా ఎన్నికై దేశంలో బీజేపీకి ప్రధాని అభ్యర్థిగా ఉన్న ఏకైక ఆప్షన్‌గా గుర్తింపు పొందారు. ఇదే సమయంలో అప్పటి యూపీఏ పాలన కుంభకోణాల మయంగా మారడం. తాజ్ హోటల్‌పై ఉగ్రవాదుల దాడి, పలు రాష్ట్రాల్లో వరుస పేలుళ్లు వంటి ఘటనలతో దేశంలో కల్లోలం రాజ్యమేలుతోంది. సరిగ్గా ఇదే తరుణంలో దేశ గమనాన్ని మార్చేందుకోసమే అన్నట్లుగా, సరైన సమయంలో సరైన నాయకుడిగా, నరేంద్ర మోడీ దేశ పాలనాపగ్గాలు చేపట్టారు. ఏకంగా సీఎం పీఠం నుంచి ప్రధాని పీఠంపైకి చేరి అప్రతిహత జైత్రయాత్రను కొనసాగిస్తూ, దేశ చరిత్రనే మోడీకి ముందు మోడీకి తరువాత అనే స్థాయిలో ఘన కీర్తిని సంపాదించుకున్నారు. తాజాగా ప్రధానిగా అత్యధిక కాలం దేశాన్ని పాలించిన ఘనతను సొంతం చేసుకున్నారు.

## 12 ఏళ్లలో అనేక అరుదైన ఘనతలు..!

2014 మే 26న తొలిసారి భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు మోడీ. ఆ తర్వాత హ్యాట్రిక్ విజయాలతో పుష్కరం పూర్తి చేసుకున్నారు. ఏకంగా 4,398 రోజులు నిరాటంకంగా సేవలందించిన భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును అధిగమించారు. ఈ క్రమంలో ప్రధానిగా నరేంద్ర మోడీ తీసుకున్న కొన్ని నిర్ణయాలు స్వతంత్ర భారత చరిత్రలోనే మైలురాళ్లుగా నిలిచిపోయాయి. వాటిలో ప్రధానంగా 370 ఆర్టికల్ రద్దు దేశ సమైక్యతకు ప్రతీకగా నిలిచింది. కాశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తి కలిగించే రాజ్యాంగంలోని ఈ ఆర్టికల్‌ను తొలగించడం ద్వారా కాశ్మీర్‌ని దేశంలో పూర్తి అంతర్భాగం చేశారు. అలాగే కాశ్మీర్, లడ్డాక్‌ను కేంద్రపాలిత ప్రాంతాలుగా చేసి దేశ విభజన కోసం యత్నిస్తున్న విచ్ఛిన్నకర శక్తుల తోకలు కత్తిరించారు. ఫలితంగా ఇతర ప్రాంతాల్లోలాగే కాశ్మీర్‌లోనూ సగటు భారతీయ పౌరుడు స్వేచ్ఛగా సంచరించడంతో పాటు స్థిరచరాస్తుల కొనుగోలుకు అవకాశం లభించింది. ఇక దేశంలో పన్ను విధానాన్ని, వస్తు ఉత్పత్తి సామర్థ్యాన్ని, ప్రజల కొనుగోలు శక్తిని, ప్రభుత్వ వ్యాపార విధానాలను సరికొత్తగా తెలియజేస్తూ తీసుకొచ్చిన జీఎస్టీ (గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్) దేశ వ్యాపార రంగంలో స్వాతంత్య్రం తర్వాత అతిపెద్ద సంస్కరణగా కితాబు లందుకుంది. ఒకేదేశం ఒకే పన్ను నినాదంతో తయారీ రంగాన్ని వివిధ కేటగిరీలుగా విభజించి పన్ను వసూలు చేయడం వల్ల కేంద్ర ప్రభుత్వానికి రాబడి అనూహ్యంగా పెరిగింది. తద్వారా అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమయ్యాయి. అలాగే దళారుల అక్రమార్జనకు అడ్డుకట్టపడింది. ఇక బీజేపీ చిరకాల వాంఛ, అయిన అయోధ్య రామమందిరాన్ని ఎలాంటి అడ్డంకులు లేకుండా నిర్మించి స్వయంగా ప్రాణప్రతిష్ట చేసి, బాలరాముడ్ని ప్రతిష్టించిన మోడీ హిందూ సమాజంలో జ్ఞానయోగిగా, ఆధ్యాత్మిక శక్తిగా తిరుగులేని పేరు సంపాదించుకున్నారు. ఈ క్రమంలో ముస్లిం మైనారిటీల్లో అసంతృప్తి పెరగకుండా, బాబ్రీ మసీదు కూల్చివేత సమస్య జఠిలం కాకుండా మోడీ వేసిన అడుగులు అనన్యసామాన్య మనే చెప్పాలి. ఇక సర్జికల్ స్ట్రైక్స్ అంటూ దేశంలో అలజడులు, అల్లర్లు ఉగ్రపేలుళ్లకు కారణమయ్యే పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులను వారి స్థావరాలకే వెళ్లి ఆర్మీ మట్టుబెట్టడం భారతదేశ రక్షణ సామర్థ్యాన్ని, త్రివిధ దళాల ప్రతిభాపాటవాలను ప్రపంచానికి చాటిచెప్పింది. తద్వారా భారత్‌పై కన్నెస్తే నామరూపాల్లేకుండా చేస్తామనే గట్టి సందేశాన్ని పాకిస్థాన్‌కి పంపడంలో మోడీ గొప్ప విజయాన్ని సాధించారు. ఇక ఆపరేషన్ సింధూర్‌తో ఉగ్రమూక లపై బాంబుల వర్షం కురిపించి శత్రువులను కకావికలం చేశారు. అదే సమయంలో లడ్డాక్‌లోని గల్వాన్ లోయలో చైనా సైన్యంతోనూ మన జవాన్లు సై అంటే సై అనేలా ముష్టియుద్ధానికి సైతం జంకకుండా సరిహద్దుల రక్షణలో దీటుగా బదులిచ్చారు. దీంతో ఇది ఒకప్పటి ఇండియా కాదు, మోడీ నాయకత్వంలో నయా ఇండియా అనేలా జిత్తులమారి చైనాకు గట్టి హెచ్చరికలు పంపారు.

ఇక యూపీఐ సేవలను విస్తరించి దేశంలో డిజిటల్ విప్ల వానికి ప్రధాని నాందిపలికారు. తద్వారా దేశ ప్రజలు తమ రోజువారీ వ్యవహారాల్లో అత్యధికభాగం ఫోన్‌పే, గూగుల్‌పే వంటి మాధ్యమాల ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. ఫలితంగా దేశంలో భౌతికంగా నగదు చెలామణి తగ్గి ప్రభుత్వానికి భారం తగ్గడంతో పాటూ వ్యాపార లావాదేవీలు మరింత వేగవంతమయ్యాయి. ఇక మేకిన్ ఇండియాతో దేశంలో వస్తుఉత్పత్తి ఎన్నోరెట్లు పెరిగింది. ఫలితంగా దేశానికి గుదిబండగా మారిన దిగుమతుల భారం క్రమంగా తగ్గుతోంది. ఇక రూ.1000, రూ.500 నోట్ల రద్దు ద్వారా శత్రు దేశాల నుండి దిగుమతవుతుండిన నకిలీ కరెన్సీతో పాటు దేశంలో బ్లాక్‌మనీకి అడ్డుకట్టపడింది. ఆయుష్మాన్ భారత్, స్వచ్ఛభారత్, ఆత్మనిర్భర్ భారత్ వంటి పథకాలతో దేశంలో వ్యవసాయ, పారిశ్రామిక, సేవా, వైద్య ఆరోగ్య రంగాలకు మోడీ కొత్త ఊపుతెచ్చారు. కోవిడ్ సమయంలో స్వదేశీ వ్యాక్సిన్లను భారత్ స్వయంగా తయారు చేసి ప్రజలకు ఉచితంగా అందించ డంతో పాటూ ఇతర దేశాలకూ ఎగుమతి చేసే స్థాయికి చేరడం కచ్చితంగా మహోన్నత మైలురాయిగానే చెప్పాల్సి ఉంటుంది.

## మోడీ అంటే బ్రాండ్.. ఇండియన్స్ అంటే క్రేజ్..!

తన పాలనా కాలంలో లెక్కకుమిక్కిలి సంస్కరణలకి ప్రాణం పోసిన మోడీ తన అసమాన స్థితప్రజ్ఞతతో ప్రపంచదేశాలను సైతం ఆశ్చర్యపరిచారు. గతంలో ఏ భారత ప్రధానికి దక్కని గౌరవం మన మోడీ సొంతం అనడంలో అతిశయోక్తి లేదు. తన పాలనాకాలంలో దాదాపు 100 దేశాల్లో విదేశీ పర్యటనలు చేసిన ప్రధాని అనేక దేశాల నుంచి అత్యున్నత సేవా పురస్కారా లను సైతం పొందారు. ఇక అగ్రరాజ్యం అమెరికా ఒత్తిడికి తలొగ్గకుండా మనదేశానికి ఎల్లవేళలా సహాయకారిగా ఉండే రష్యాతో చెలిమిని విడిచిపెట్టకుండా, బంధాన్ని మరింత దృఢ పరుచుకున్న తీరుసైతం ప్రశంసనీయమే. అందుకే భారత పాస్‌పోర్టు విలువ, స్థాయి క్రమంగా ప్రపంచదేశాల్లో పెరుగుతూ పోతోంది. ఇక అత్యంత వేగంగా అభివృద్ధి చెందే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఇప్పటికే రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ఇంతటి మహత్తర ఘనతలన్నింటికీ కర్త..కర్మ.. క్రియ శ్రీ మోడీ అనడంలో ఏమాత్రం సందేహం లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు మోడీ అంటే ఓ బ్రాండ్. ఆయన సారథ్యంలోని ఇండియన్స్ అంటే ఓ క్రేజ్. పారదర్శక పాలన, పారదర్శక అభివృద్ధి, పారదర్శక సంస్కరణలు అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న మోడీ ఇప్పటికే వందేభారత్ రైళ్ల తయారీతో తన బ్రాండ్‌ను సరికొత్త శిఖరాలపై ఆవిష్కరించారు. త్వరలో బుల్లెట్ రైలునూ పట్టాలెక్కించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేందుకు వడివడిగా అడుగులు వేస్తుండడం విశేషం. ఏదేమైనా స్వాతంత్ర భారత చరిత్రలో మోడీ స్థాయి నేత లేరు అన్నది నిర్వివాదం. ఓ సాధారణ చాయ్ వాలా దేశ గమనాన్ని మార్చే చోదకశక్తి కావడం భారత ప్రజాస్వామ్య విజయం భారత ప్రజల విజయం అనడంలో సందేహం లేదు.

పుష్కలమైన సంస్కరణల సారథిగా.. పుష్కర కాలం పూర్తి చేసుకున్న తరుణంలో "జయహో మోడీ"..!

# బీసీ రిజర్వేషన్లను సక్రమంగా అమలుచేయాలి

## ● డెడికేటెడ్ కమిషన్ ఛైర్మెన్ రాజీవ్‌రంజన్ మిశ్రా



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న రాజీవ్‌రంజన్ మిశ్రా

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజీ రిజర్వేషన్లను పారదర్శకంగా అమలుచేయాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, డెడికేటెడ్ కమిషన్ ఛైర్మెన్ రాజీవ్ రంజన్ మిశ్రా స్పష్టం చేశారు. ఈనెల 17న ఆయన కావలిలోని ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన అధికారుల సమావేశంలో పాల్గొన్నారు. పంచాయతీల్లో ఎంపీటీసీల స్థానాల విభజన ఏవిధంగా జరిగిందని ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. కావలిమండలం అన్నగారిపాలెం పంచాయతీలో 14 వార్డులు ఉండగా, ఎంపీటీసీ-1, 2 ప్రాదేశిక స్థానాలను ఏ ప్రాతిపదికన విభజించారని ఆయన ప్రశ్నించారు. కావలి పట్టణంలోని 40 వార్డుల్లో 13 సీట్లు బీసీలకు ఎలా కేటాయించారని కమిషనర్ శ్రావణ్‌కుమార్‌ను అడిగారు. సమీకృత కుటుంబ సర్వేని గ్రామసభల ద్వారా ఆమోదించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, ఆర్డీఓ ఎలీషాబాబు, తహశీల్దార్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వసతులు లేని.. 'వసతి గృహాలు'

## ● హాస్టళ్ళ తీరుపై ఏఐఎస్ఎఫ్ ఆందోళన



జిల్లాలో పేద విద్యార్థులు చదువు కుంటున్న అనేక వసతి గృహాల (హాస్టళ్ళ)లో సరైన వసతులు లేక విద్యార్థులు నిత్యం ఎన్నో అవస్థలు పడుతు న్నారని, అధికారులు వాటి పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 17న నెల్లూరులోని సాంఘిక సంక్షేమ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్‌షరీఫ్, నగర కార్యదర్శి శివం వర్మ, సోహెల్ తదితర నాయకుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లాలోని పలు సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఆర్‌ఓ ప్లాంట్‌లు సక్రమంగా పనిచేయక పోవంతో విద్యార్థులు తాగేందుకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారని, అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇచ్చే మెస్‌చార్జీలను, పెరిగిపోతున్న ధరలకు అనుగుణంగా కనీసం 3వేల రూపాయలకు పెంచాలని వారు కోరారు. వసతి గృహాలను అద్దెభవనాల్లో నిర్వహిస్తూ కోట్లాది రూపాయలను అద్దె రూపంలో చెల్లించడం ఎంతవరకు సమంజసమో ప్రభుత్వం ఆలోచించాలన్నారు. ఎస్సీఎస్టీ బీసీ హాస్టళ్లలో అనేక ఉద్యోగాలు ఖాళీగానే ఉన్నా వాటిని భర్తీచేసే యోచన చేయడం లేదని వారు విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం ఈ సమస్యలు పరిశీలించి హాస్టళ్లను సక్రమంగా నిర్వహించాలని కోరుతూ వారు సాంఘిక సంక్షేమ కార్యాలయం సూపరింటెండెంట్‌కి వినతిపత్రం అందజేశారు.

# ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు దొరికారు

చిల్లకూరు మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవలి కాలంలో పలు ట్రాన్స్‌ఫార్మర్లను అపహరించుకుపోయిన కేసులో నిందితులను ఈనెల 17న ఎస్ఐ సురేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. ఇటీవల మండలంలోని రెట్టపల్లి, ఓడూరు, తీపనూరు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు అదృశ్యమయ్యాయి. వాటిని గూడూరు మండలం వెందోడు గ్రామానికి చెందిన శ్రీహరి, విజయకుమార్, హరికృష్ణలు అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. విద్యుత్‌శాఖ వారి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితులను వరగలి క్రాస్‌రోడ్డు వద్ద గుర్తించి వారిని అరెస్ట్‌చేసి కోర్టుకు హాజరుపరచారు.

# త్రిచక్ర వాహనాల కోసం.. దివ్యాంగుల వినతి

జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం త్రిచక్రవాహనాలను కేటాయించినా, సరైన ప్రచారం లేక అవి దివ్యాంగులకు అందడం లేదని, పరిశీలించి ఆ వాహనాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా కోరారు. ఆమేరకు ఈనెల 17న విజయవాడలోని ఏపీ దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్మెన్ జి.నారాయణస్వామికి వినతి పత్రం అందజేశారు. ఇటీవల జిల్లాకు 40 వాహనాలు వచ్చినా, దివ్యాంగులకు తెలియకపోవడంతో వాటిని తీసుకోలేకపోయారని ఆయన తెలిపారు. దీంతో, ఛైర్మెన్ స్పందిస్తూ ఆ వాహనాల పంపిణీకి సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# వ్యాధుల నుంచి రక్షించే..యోగా

యోగా శారీరకమైన అనేక బాధల నుంచి, వ్యాధుల నుంచి కూడా మనకు రక్షణ కల్పిస్తుందని, ప్రతిఒక్కరూ యోగా సనాల సాధనతో ఆరోగ్యాన్ని పరి రక్షించుకోవాలని వక్తలు చెప్పారు. ఈ నెల 17న నెల్లూరు మూలాపేటలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో జరిగిన యోగా శిక్షణా తరగతుల్లో యోగాకు సంబంధించిన ప్రాణాయామం, ధ్యానం వంటి వాటి గురించి ఇషా ఫౌండేషన్ సంస్థ ప్రతినిధి సందీప్ వివ రించారు. ఆలయ ఛైర్మెన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ మరియు ఇఓ జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొని యోగాసనాలు సాధన చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాపై ఈ శిక్షణా కార్యక్రమాలు చేపట్టామని



యోగాసనాలు వేస్తున్న ఆలయ సిబ్బంది

వారు తెలిపారు. పలువురు అర్చకులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

## నెల్లూరు నగర కార్పొరేషన్

# వార్డుల పునర్విభజనకి హైకోర్టు బ్రేక్

### ప్రక్రియ నిలిపేయాలంటూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన న్యాయస్థానం



నెల్లూరు నగర కార్పొరేషన్ రాజకీయం మరోసారి వివాదాల సుడి గుండంలో చిక్కుకుంది. 2005 సంవత్సరంలో మున్సిపాలిటీ నుండి కార్పొరేషన్‌గా మారిన నాటినుండి మునిసిపల్ రాజకీయాలు నిత్యం వివాదాస్పదంగానే మారి ఏదో ఒక రూపంలో వార్తలలో ఉంటున్నాయి. తాజాగా వార్డుల డీ లిమిటేషన్ (పునర్విభజన) పేరుతో 54 వార్డులని 72 వార్డులుగా పెంచాలన్న అధికారపార్టీ నాయకుల ప్రయత్నాలకి హైకోర్టు అడ్డుకట్ట వేసింది.

జనగణన, కులగణన జరుగుతున్న తరుణంలో డీ లిమిటేషన్ చేయడం సబబు కాదంటూ వైసీపీ నగర ఇంచార్జ్, శాసనమండలి సభ్యుడు పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి హైకోర్టుని ఆశ్రయించారు. ఓ వైపు సర్ ప్రక్రియ, మరోవైపు సెన్సెస్ (జనగణన, కులగణన) జరుగుతున్నాయని, అలాగే సరిహద్దులు నిర్ణయించడంలోనూ అవకతవకలు జరిగాయని, పెన్నాకు అటు వైపు ఇటువైపు అన్న వ్యత్యాసం లేకుండా తమ ఇష్టానుసారం వార్డుల విభజన చేశారని ఆరోపిస్తూ చంద్రశేఖరరెడ్డి కోర్టు మెట్లు ఎక్కారు. కులాల ప్రాతిపదికన కొన్ని కాలనీలని కూడా అడ్డంగా విడగొట్టారని ఎమ్మెల్సీ ఆరోపించారు. ఇరు పక్షాల వాదన విన్న న్యాయస్థానం పునర్విభజన ప్రక్రియని నిలిపేయాలంటూ జూన్ 18వ తేదీ గురువారం మధ్యాహ్నం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ పరిణామంతో వార్డుల డీ లిమిటేషన్ ప్రక్రియకి బ్రేకులు పడినట్లే. ప్రస్తుత పాలకమండలికి నవంబర్ 23 వరకు గడువుంది. ఈలోగా వార్డుల విభజన పూర్తిచేసి ఎన్నికలు జరపాలన్న అధికారపార్టీ నేతల ఆలోచనకి ప్రస్తుతానికి తెరపడినట్లే.

### అన్నీ సరిచేస్తాం.. - టీడీపీ నేతలు

హైకోర్టు నిర్ణయంతో వైసీపీ శ్రేణులు సంబరాలు చేసుకుంటుంటే, అధికార పార్టీ నేతలు మాత్రం ఈ కోర్టు ఉత్తర్వులు టీ కప్పులో తుఫాన్ మాత్రమే అని కొట్టి పారేస్తున్నారు. 'సర్' ఇంకా మరికొంత కాలం కొనసాగుతుందని, స్థానిక సంస్థలకి 'సర్' వర్తించదని చెప్తున్నారు. అలాగే వైసీపీ నేతల అభియోగాలన్నిటికి సరైన రీతిలో సమాధానాలు ఇచ్చి, డీ లిమిటేషన్ ప్రక్రియతో పాటు గడువు ప్రకారం ఎన్నికలు కూడా నిర్వహిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# ప్రసన్నా.. ఖబడ్దార్!

## - హెచ్చరించిన ప్రశాంతమ్మ -



**విమర్శ, ప్రతివిమర్శలతో కోవూరు రాజకీయం మరోసారి వేడెక్కింది. మధ్యలో కొద్దికాలం స్తబ్దుగా వున్న కోవూరు మాజీ శాసనసభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి తాజాగా ప్రశాంతమ్మపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి మళ్ళీ రచ్చకెక్కారు.**


ఇటీవల ఓ కార్యక్రమంలో కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని సోమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అని సంబోధించి వివాదానికి తెరలేపారు. ప్రసన్న వ్యాఖ్యలపై ప్రశాంతమ్మ బుధవారం నాడు ఘాటుగా స్పందించారు. ఇటీవల రాష్ట్ర హోంమంత్రి అనితపై గుడివాడ అమర్నాథ్ చేసిన కామెంట్‌పై ప్రశాంతమ్మ స్పందిస్తూ "మహిళలపై ఇలాంటి నీచమైన వ్యాఖ్యలు చేయడం తగదని, తమ నియోజకవర్గంలో కూడా ఇలాంటి వాడు ఒకడు వున్నాడని, స్త్రీ జాతిని అవమానిస్తే అదే స్త్రీలు వాళ్ళని తరిమి తరిమి కొడతారని" తాను అన్నానని ఆమె చెప్పారు. "తన మాటలకి స్పందించిన ప్రసన్నకుమార్‌రెడ్డి తనని సోమిరెడ్డి ప్రశాంతమ్మా, మీ ఆయన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి చేసిన అభివృద్ధి చూడమ్మా అంటూ తన పైన అనుచిత వ్యాఖ్యలు చేసాడని ప్రసన్నకి పిచ్చా, చాదస్తమా" అంటూ ప్రశ్నించారు.

"మతి భ్రమించి మాట్లాడుతున్నాడని, మదమెక్కి మాట్లాడుతున్నాడని ప్రశాంతమ్మ ఘాటుగా విమర్శించారు. తాను సోమిరెడ్డి ప్రశాంతినా లేక వేమిరెడ్డి ప్రశాంతినా అన్న విషయం ప్రసన్నకు అనవసరం అన్నారు. ఎన్నికల కోసం తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన రోజే తనని తాను పరిచయం చేసుకుని వాస్తవాలన్నీ ప్రజలకి విడమర్చి చెప్పి, వారి ఆశీస్సులతో తాను ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. "నేను నల్లపరెడ్డి ప్రసన్నని అని చెప్పుకుని ప్రజల మధ్యకి వచ్చిన నిన్ను తరిమితరిమి కొట్టారు, ముందు అది చూసుకో.." అంటూ ప్రసన్న వ్యాఖ్యలని గట్టిగా తిప్పికొట్టారు. "ప్రజలకి సేవ చేయడానికి ఎవరైతే ఏమిటి. నేను రెండు కుటుంబాలకి గౌరవం తెచ్చిన ఆడబిడ్డని" అన్నారు. "నీ మాటలకి భయపడి వెన కడుగు వేస్తామని అనుకుంటున్నావేమో... మళ్ళీమళ్ళీ చెప్తున్నా నిన్ను వదిలిపెట్టేది లేదు. నువ్వు చేసిన అవినీతి అంతా ఇంతా కాదు..ఖబడ్దార్" అంటూ హెచ్చరించారు.

"నీకు ఎన్నిసార్లు చెప్పినా బుద్ధిలేదా..? నా గురించి మాట్లాడడానికి నీకేమి హక్కుంది..? అవును నేను సోమిరెడ్డి ప్రశాంతినే ఇప్పుడు ప్రభాకరరెడ్డి గారిని పెళ్ళి చేసుకుని వేమిరెడ్డి ప్రశాంతిగా మారాను. ప్రసన్నా... నీకు ఇప్పుడే చెప్తున్నా మళ్ళీ నిన్ను ఈ కోవూరు మహిళలు తరిమి తరిమి కొడతారు, ఒక్కరుకూడా నీకు ఓటెయ్యరు" అంటూ ధ్వజమెత్తారు. మహిళలంతా అప్రమత్తంగా వుండాలని మహిళలని దారుణంగా విమర్శించే ప్రసన్నలాంటి రాజకీయవేత్తలకి ఓటు అడిగే హక్కులేదని అలాంటి వాళ్ళని మహిళలు దగ్గరకి కూడా రానీయకుండా తగు సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు.

### ప్రసన్నకు ఆ మాత్రం తెలీదా...?

ప్రశాంతమ్మ పదకొండేళ్ళ క్రితమే వేమిరెడ్డి ప్రశాంతిగా మారారు. వేమిరెడ్డి ప్రశాంతిగానే రెండు పర్యాయాలు టీటీడీ బోర్డు సభ్యురాలిగా ప్రమాణం చేశారు. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిగానే వీపిఆర్ ఫౌండేషన్ ట్రస్టీగా ఉన్నారు. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గానే ఎన్నికలలో నామినేషన్ వేశారు. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గానే శాసనసభ్యురాలిగా చట్టసభలో(శాసనసభలో) ప్రమాణం చేశారు. ఇవన్నీ తెలిసి కూడా.. ప్రసన్న ప్రశాంతమ్మని సోమిరెడ్డి ప్రశాంతిగా సంబోధించడాన్ని వైసీపీ శ్రేణులు సైతం తప్పుపడుతున్నారు. పలు పర్యాయాలు ఎమ్మెల్యేగా, మాజీ మంత్రిగా నల్లపరెడ్డి వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన సీనియర్ రాజకీయవేత్తగా ప్రజాక్షేత్రంలో కొనసాగుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డికి ఆమాత్రం జ్ఞానం లేదా? మహిళలకి ఆయనిచ్చే గౌరవం ఇదేనా? అని కోవూరు ప్రజలతో పాటు వైసీపీ నేతలు కూడా ప్రశ్నిస్తుండడం గమనార్హం!



లాయర్
జూన్ 19, 2026

# యోగా..ఇప్పుడొక 'నిత్యావసరం'!

నేటి ఆధునిక కాలం మనిషిని యంత్రంలా పరుగులు తీయిస్తోంది. కృత్రిమ మేధస్సు, సాంకేతిక విద్యల ప్రభావం మనిషిని నిలువనీయడం లేదు. అంతా పరుగుల ప్రపంచమైపోయింది. దీంతోపాటు మానవుని జీవనశైలి కూడా అత్యంత అధ్వాన్నంగా తయారవుతోంది. తినే తిండి, తాగే నీరు, పీల్చే గాలి అన్నీ కాలుష్యమయమైపోవడం, పచ్చదనం-పర్యావరణం అన్నీ నాశనమవుతుండడం మనం చూస్తూనే ఉన్నాం. మానవుని స్వార్థానికి పచ్చని ప్రకృతి కూడా ధ్వంసమైపోతోంది. ధన దాహానికి, తినే ఆహారపదార్థాలు కల్తీ అయిపోతున్నాయి. దీంతో ఎక్కడ చూసినా రోగాలు నిండిపోతున్నాయి. నిరంతరం ఎన్నో రకాల సమస్యలతో..మానసిక, శారీరక వత్తిడులతో ప్రజలు సతమతమైపోతున్నారు. బీపీలు, షుగర్లు, ఊబకాయాలు, క్యాన్సర్లు వంటి రోగాలు చుట్టుముట్టి ప్రజా జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. పాశ్చాత్య వ్యామోహంతో మన జీవనశైలి పూర్తిగా అస్తవ్యస్థమైపోతోంది. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అని పెద్దలు చెప్పారు కానీ, ఆ భాగ్యానికి ఇప్పుడెవరూ నోచుకోలేకపోతున్నారు. ఎంత డబ్బున్నా ఆరోగ్యం లేనిదే ప్రయోజనం ఏముంటుంది?.. ధనికవర్గాలవారు సైతం జబ్బులు తగ్గించుకునేందుకు ఉన్న డబ్బంతా ధారపోస్తూ ఆసుపత్రుల చుట్టూ తిరగడమే పనైపోతోంది. సామాన్యుల సంగతి మరింత దయనీయంగా ఉంటోంది. పూర్వకాలంలో చేతినిండా పని ఉండేది. అందరూ కష్టపడి పనిచేసుకునేవారు. స్వచ్ఛమైన గాలీ, నీరు.. వాతావరణం ఎంతో బాగుండేది. అలాంటి ప్రకృతినంతా మనకు మనమే ధ్వంసం చేసేసుకున్నాం. వాటన్నిటి దుష్ఫలితాలే ఇవి. అయితే, ఇలాంటి దురవస్తలన్నిటినీ అధిగమించేందుకు కూడా మనదేశంలో ప్రాచీనకాలం నాటి మహర్షులు తరుణోపాయం చెప్పారు. ఎంతో ముందుచూపుతో యోగా, ధ్యానం వంటి మహత్తరమైన విధానాలను లోకానికి బోధించారు. దేహధర్మాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, ఎలాంటి ఆసనాలు సాధన చేస్తే ఎలాంటి ప్రయోజనం కలుగుతుందో సమగ్రంగా మన శాస్త్రాల్లో వివరించి చెప్పారు. మానవ శరీరం లోని అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆధ్యాత్మిక కోశాల కలయికతో ఏర్పడే మానవ దేహం ఎలాంటి సాధనలు చేస్తే ఆరోగ్యంగా ఉంటుందో తమ అనుభవాన్నంతా రంగరించి మరీ తెలియజేశారు. మనసుకు-శరీరానికి మధ్య సమతుల్యతను సాధించాలని స్పష్టంగా బోధించారు. యోగా సాధకులు ఇప్పుడు వాటిని అందరికీ వివరిస్తున్నారు కూడా. శరీరం, మనసు, ఆత్మ అనే మూడు ముఖ్యమైన అంశాల శ్రేయస్సును సూచించే శాస్త్రమే యోగా. ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని నేర్పే ఒక అద్భుతమైన ప్రక్రియే యోగా!.. వేదాల్లోనూ దీని గురించి ఎన్నో ప్రస్తావనలున్నాయి. ఇకనైనా మనం వాటిని అవగాహన చేసుకుని అనుసరిస్తే అనారోగ్యపు విషవలయాల నుంచి మన ఆరోగ్యాన్ని మనం కాపాడుకోవచ్చు. ఈ ఆధునిక కాలంలో ఏ ఖర్చు లేకుండానే మనకు లభించే దివ్యౌషధం యోగా ఒక్కటే. మానసిక-శారీరక శాంతికి, ఉల్లాసానికి, అన్నిరకాల వత్తిడులను తట్టుకుని సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించుకోవడానికి ఉన్న ఒకే ఒక్క ప్రత్యామ్నాయం యోగా మాత్రమే. ఇటీవలికాలంలో మన ప్రధాని మోడీ పుణ్యమా అంటూ యోగాకి ప్రపంచస్థాయిలో కూడా ఒక ప్రత్యేక గుర్తింపు వచ్చింది. 2014లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ఆయన చేసిన ప్రతిపాదనతో యోగాకి అంతర్జాతీయ ఖ్యాతి లభించింది. దీంతో, ప్రపంచవ్యాప్తంగా 2015 నుంచి జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అన్ని దేశాల వారు జరుపుకోవడం ప్రారంభించారు. ప్రజల్లో యోగా పట్ల ఆసక్తిని కలిగించి, వారి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడే యోగా ప్రత్యేకతలను యోగ సాధకులు, అనుభవజ్ఞులు అందరికీ వివరిస్తున్నారు. మనదేశంలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాకి ఎంతో ప్రాధాన్యతనిస్తున్నాయి. ప్రజలకు యోగాని చేరువ చేసేందుకు అన్నిరకాల కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నాయి. ఇదొక శుభ పరిణామం. అందుకే ఆరోగ్యాన్నిచ్చి, ఆయువుని పెంచే యోగా కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాల్సి ఉంది. అయితే, యోగా అనేది.. మనకు తీరిక ఉన్నప్పుడు సాధన చేసేది కాదు..ప్రతి నిత్యం మన జీవితంలో యోగా ఒక భాగం కావాలి. ఎవరికి వారు తమ జీవనశైలిని సరిదిద్దుకుని, నిరంతరం యోగా, ధ్యానం వంటి వాటిని అనుసరించగలిగితే మనసుకెంతో ప్రశాంతత కలుగుతుంది. ఆరోగ్యానికెంతో శ్రేయస్కరంగా ఉంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే యోగా..నేటి ఆధునిక కాలంలో ఆరోగ్య పరిరక్షణకు కేవలం ఒక ప్రత్యామ్యాయం మాత్రమే కాదు.. సకల మానవాళికీ ఇప్పుడొక నిత్యావసరం కూడా.

... (జూన్ 21, అంతర్జాతీయ యోగా దినోత్సవం)

# భారత్‌కి ఊరటనివ్వనున్న అమెరికా-ఇరాన్ ఒప్పందం!

ఎట్టికేలకు అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. దీనివల్ల భారత్‌కు ఆర్థికంగా, వ్యూహాత్మకంగా ఊరట లభిస్తుందనడంలో సందేహం లేదు. హోర్ముజ్ జలసంధి తెరవడంతో భారతదేశానికి దిగుమతి అయ్యే ఎల్‌పిజిలో 60%, చమురులో 30% సరఫరా పూర్తి స్థాయిలో పునరుద్ధరించబడుతుంది. బ్రెంట్ క్రూడ్ 4.1% తగ్గే అవకాశాలు వున్నాయి. దీంతో ద్రవ్యోల్బణం, వాణిజ్య లోటు కూడా అదుపులోకి వస్తాయి. అమెరికా ఆంక్షల సడలింపుతో చబహార్ ప్రాజెక్టు మళ్లీ కదులుతుంది.యుద్ధం వల్ల నిఫ్టీ బాగా నష్టపోయింది. ఈ తాజా ఒప్పందంతో చమురు ధరలు తగ్గి రూపాయి బలపడే అవకాశం ఉంది. ఇరాన్ చమురు మళ్ళీ అందితే దిగుమతి బిల్లు, ఎల్‌పిజి సబ్సిడీ భారం తగ్గుతాయి. ఇరాన్‌తో సంబంధాలను అమెరికా ఒత్తిడి లేకుండా భారత్ కొనసాగించవచ్చు. ఆఫ్ఘనిస్తాన్‌లో భారత ప్రయోజనాలకు ఈ ఒప్పందం కలిసొస్తుంది!

టి. లక్ష్మీనారాయణ, విశాఖపట్టణం.

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

# 'క్యాడర్‌కి కన్నీళ్ళు' వాస్తవిక పరిస్థితికి అద్దం పడుతుంది!

గత వారం మన లాయర్‌లో "కూటమికి రెండేళ్లు – క్యాడర్‌కి కన్నీళ్లు" అంటూ మొదటి పేజీలో ప్రచురించిన విశ్లేషణ వాస్తవ పరిస్థితికి అద్దం పట్టినట్లుగా ఉంది. గత ప్రభుత్వంలో అంటే 2019–2024 మధ్యకాలంలోని వైసీపీ హయాంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు అనేక కష్టాలు ఎదుర్కొన్నారు. కేసులు పెట్టించుకున్నారు, జైళ్ళ పాలయ్యారు. వైసీపీ అరాచకాలని అడ్డుకోవడంలో నానా పాట్లు పడ్డారు. అయితే, 2024 ఎన్నికలలో అదే వైసీపీకి చెందిన కొంతమంది అగ్రశ్రేణి నేతలు పార్టీలు మారారు. వారితో పాటు వారి అనుచర గణం కూడా టీడీపీ, బీజేపీ, జనసేన కండువాలు కప్పుకున్నారు. ఇప్పుడు అక్కడే అసలు చిక్కు వచ్చి పడింది. కూటమి నాయకులు, కార్యకర్తలకు ధీటుగా వలసవాదులు కూడా అధికార దర్పం చూపిస్తున్నారు. తమ నాయకుల ఆశీస్సులతో నామినేటెడ్ పదవులు దక్కించుకుంటున్నారు. ఈ క్రమంలోనే నెల్లూరుజిల్లాలో మేకపాటి శాంతకుమారి గ్రంథాలయ సంస్థ చేజిక్కించుకుంది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలా అనేక విభాగాలలో వైసీపీ నుండి గోడ దూకి వచ్చిన వాళ్ళకే కూటమి నాయకులు అగ్ర తాంబూలం ఇస్తున్నారు. ఇప్పటికైనా కళ్ళు తెరచి నిజమైన టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులని గుర్తించి వారికి సముచిత స్థానం కల్పించవలసిన బాధ్యత కూటమి నాయకులపైన వుంది!

– వీ.సీ. చౌదరి, మాగుంట లే అవుట్, నెల్లూరు.

# దేశీయ ఆవిష్కరణలపై యువత దృష్టి పెట్టాలి!

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో 'పద్మభూషణ్' డాక్టర్ వరప్రసాదరెడ్డి గారికి గౌరవ డాక్టరేటు ప్రదానం చేయడం సముచితం, జిల్లాకే గర్వకారణం. వారి ప్రసంగం ఎంతో స్ఫూర్తిదాయకం. భారతీయ వైద్యఆరోగ్య రంగంలో తొలిసారిగా వ్యాక్సిన్(టీకా)ని తయారు చేసి సంచలనాత్మక విజయం సాధించిన ధీశాలి వరప్రసాద్‌రెడ్డి గారు. వరప్రసాద్‌రెడ్డి లాంటివాళ్ళని ఆదర్శంగా తీసుకుని మన యువత దేశీయ ఆవిష్కరణలపై దృష్టి సారించి దేశ ఆర్థిక ప్రగతికి కృషిచేయాలి!

సీ. ఆర్. విశ్వేశ్వరరావు
మాజీ ఉపకులపతి, హైదరాబాదు.

# శాంతి ఒప్పందంతో ప్రపంచానికి ఊరట

మనసులో మాట 102

సుదీర్ఘ కాలంగా పశ్చిమాసియాను, తద్వారా మొత్తం ప్రపంచాన్ని అశాంతి, తీవ్ర యుద్ధ భయాల్లో ముంచెత్తిన ఇరాన్–అమెరికా సంక్షోభం ఎట్టకేలకు ఒక దౌత్యపరమైన ముగింపునకు రావడం ఈ శతాబ్దపు అత్యంత కీలక పరిణామం అనడంలో ఎలాంటి సందేహం లేదు. భౌగోళికంగా పరిశీలిస్తే అమెరికా, ఇరాన్ దేశాల మధ్య వేల మైళ్ల దూరం ఉంది, వీటికి నేరుగా ఎలాంటి భూసరిహద్దులు లేవు. అయితే, ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేస్తోందని, ఇరాన్‌లోని ప్రజలను అణచివేస్తోందని ఆరోపిస్తూ ఇజ్రాయెల్ తో కలిసి అమెరికా సైనిక చర్యకు దిగింది. పేరుకు ఇది సైనిక చర్యే అయినా యుద్ధమే జరిగింది. యుద్ధం తొలిరేజే ఇరాన్ అధ్యక్షుడిని చంపేసింది. అయినా ఇరాన్ దళాలు తలొగ్గకుండా అమెరికాతో తలపడ్డాయి. యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన సరఫరాకు కీలకమైన హర్మూజ్ జలసంధి మూతపడడంతో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలు కుదేలయ్యే పరిస్థితి ఏర్పడింది. ద్రవ్యోల్బణం పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కుదిరిన చారిత్రాత్మక శాంతి ఒప్పందం కేవలం రెండు దేశాల ఘర్షణకు ముగింపు మాత్రమే కాదు; ఇది యావత్ ప్రపంచ మానవాళికి లభించిన ఒక గొప్ప ఉపశమనం. ఇన్నాళ్లూ యుద్ధ మేఘాలు, ఆర్థిక ఆంక్షలు, పరస్పర క్షిపణి దాడుల భయంతో నిరంతరం బిక్కుబిక్కుమంటూ గడిపిన యావత్ మానవాళికి ఈ ఒప్పందం పెద్ద ఊరటనిచ్చింది. పశ్చిమాసియాలో శాంతి నెలకొనడం వల్ల ప్రపంచవ్యాప్తంగా నిలిచిపోయిన అంతర్జాతీయ సరఫరా గొలుసులు మళ్లీ దారిలోకి వస్తాయి. దీనివల్ల చమురు ధరలు అదుపులోకి వచ్చి ప్రపంచాన్ని వేధిస్తున్న ద్రవ్యోల్బణ భయాలు తొలగిపోతాయి. శాంతియుత వాతావరణం అన్ని రంగాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుంది.

డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ఈ యుద్ధాన్ని ఇంత అత్యవసరంగా విరమించుకోవడానికి, ఒప్పందానికి మొగ్గు చూపడానికి బలమైన కారణాలు ఉన్నాయి. అన్నింటికంటే ముఖ్యమైనది శత్రు భూభాగంలో అమెరికాకు నేరుగా 'స్థాన బలం' లేకపోవడం. ఇరాన్ చుట్టుపక్కల అమెరికా సైనిక స్థావరాలు ఉన్నప్పటికీ, ఇరాన్ సొంత భౌగోళిక వ్యూహాత్మక స్థానం, దాని సుదీర్ఘ శ్రేణి క్షిపణి సామర్థ్యం ముందు సుదూర ప్రాంతం నుండి వచ్చి యుద్ధం చేయడం అమెరికాకు భారీగా నష్టపోవడమే అవుతుందని వైట్‌హౌస్ గ్రహించింది. దీనికితోడు, ఈ యుద్ధం పట్ల ప్రపంచవ్యాప్తంగా వివిధ మిత్ర దేశాల నుంచి సైతం తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అంతర్జాతీయంగా అమెరికా ఒంటరి కాదగిన పరిస్థితి ఏర్పడింది. అన్నింటికంటే మించి, స్వదేశంలోనే అమెరికా ప్రజల నుండి, ప్రతిపక్షాల నుండి వెల్లువెత్తిన నిరసనలు, ఆర్థిక సంక్షోభ భయాలు ట్రంప్ దూకుడుకు గట్టి కళ్లెం వేశాయి. దీంతో కేవలం సైనిక శక్తితో ఇరాన్‌ను లొంగదీసుకోలేమని, దౌత్యమే ఏకైక మార్గమని అమెరికా అత్యవసరంగా గుర్తించాల్సి వచ్చింది.

అయితే, ఈ ఒప్పందం అమెరికాకు, దాని చిరకాల మిత్రదేశమైన ఇజ్రాయెల్‌కు మధ్య తీవ్ర విభేదాలను సృష్టించింది. ఇరాన్‌ను పూర్తిగా ఒంటరి చేసి అణచివేయాలనేది ఇజ్రాయెల్ వ్యూహం. కానీ అమెరికా ఇరాన్‌తో చర్చలు జరపడం, ఆంక్షలను సడలించడం ఇజ్రాయెల్‌కు ఏమాత్రం మింగుడుపడటం లేదు. వాషింగ్టన్ తీసుకున్న ఈ ఏకపక్ష నిర్ణయం వల్ల పశ్చిమాసియాలో తమ ఉనికికి, భద్రతకు తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందని ఇజ్రాయెల్ ఆందోళన చెందుతోంది. ఈ ఒప్పందం విషయంలో ఇరు దేశాల రక్షణ, దౌత్య విధానాల మధ్య స్పష్టమైన చీలిక కనిపిస్తోంది.

ఈ చారిత్రాత్మక ఒప్పందం వల్ల భారతదేశానికి వ్యూహాత్మకంగా, ఆర్థికంగా భారీ ప్రయోజనాలు చేకూరుతాయి. మొదటిగా, భారత్ తన ముడిచమురు అవసరాల కోసం పశ్చిమాసియాపైనే ఎక్కువగా ఆధారపడుతుంది కాబట్టి, ఈ ఒప్పందం వల్ల అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు స్థిరపడి భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊరట లభిస్తుంది. అన్నింటికంటే ముఖ్యంగా, అమెరికా ఆంక్షల కారణంగా ఇటీవల కాలంలో చాబహార్ ఓడరేవు ప్రాజెక్ట్ నుండి భారత్ తాత్కాలికంగా వెనక్కి తగ్గాల్సి వచ్చింది. బడ్జెట్ నిధుల నిలిపివేత, నిర్వహణ సంస్థల ఉపసంహరణతో నిలిచిపోయినట్లు కనిపించిన ఈ వ్యూహాత్మక ప్రాజెక్టుకు ఇప్పుడు కుదిరిన ఈ శాంతి ఒప్పందంతో మళ్లీ కొత్త ఊపిరి వస్తుంది. ఆంక్షల మేఘాలు తొలగిపోవడంతో భారత్ తిరిగి చాబహార్ పోర్ట్ ప్రాజెక్టులోకి అధికారికంగా ప్రవేశించడానికి, మధ్య ఆసియా దేశాలతో వాణిజ్య మార్గాలను పునరుద్ధరించుకోవడానికి మార్గం సుగమం అవుతుంది. వీటికి తోడు పశ్చిమాసియా దేశాల్లో లక్షలాది మంది భారతీయులు ఉపాధి పొందుతున్నారు. అక్కడ శాంతి నెలకొనడం వల్ల వారి ప్రాణాలకు, ఉద్యోగాలకు భద్రత లభిస్తుంది. అలాగే ఇరాన్‌తో భారత్‌కు ఉన్న పురాతన సాంస్కృతిక, దౌత్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయి. భారత విదేశాంగ విధానానికి ఇది ఒక గొప్ప విజయంగా నిలుస్తుంది.

ఏదైనా సంక్షోభానికి తుది ముగింపు చర్చల ద్వారానే సాధ్యమని ఇరాన్–అమెరికా తాజా ఒప్పందం నిరూపించింది. పంతాలు, పట్టింపులను పక్కన పెట్టి శాంతి వైపు అడుగులు వేయడం ద్వారానే ప్రపంచ ప్రగతి సాధ్యమవుతుంది. ఈ ఒప్పందం ప్రపంచాన్ని వినాశకరమైన యుద్ధ ప్రమాదం నుండి తప్పించి, ఒక నూతన శాంతి శకానికి నాంది పలికింది. ఇరు దేశాల నాయకత్వం ప్రదర్శించిన వివేకం ప్రశంసనీయం.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

# రెండేళ్ల విజయాలను.. స్ఫూర్తిగా తీసుకోవాలి

## విజయోత్సవ సభలో మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి



'రెండేళ్ళ నమ్మకం - అభివృద్ధి సంక్షేమం' విజయోత్సవ సభలో పాల్గొన్న కూటమి జిల్లా నేతలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఈ రెండేళ్ళలో సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని అందరూ ముందుకు సాగాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 16న నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం–అభివృద్ధి, సంక్షేమం' జిల్లా స్థాయి విజయోత్సవ సభ టీడీపీ నేతలు, కార్యకర్తల కోలాహలంతో సంబరంగా జరిగింది. ఈ సభలో మంత్రి ఆనం మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల కాలంలో అభివృద్ధి సంక్షేమం సమాంతరంగా ముందుకు తీసుకెళ్లడం జరుగుతోందన్నారు. గత ప్రభుత్వం చేసిన అస్తవ్యస్థ పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగిందని, కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగా సుపరిపాలన సాగిస్తోందని అన్నారు. కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకొని, విజయోత్సవ సభను నెల్లూరులో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని ఎంపీ విపిఆర్ చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ క్రమశిక్షణ, యువనేత నారా లోకేష్‌బాబు నిబద్ధతతోనే కూటమి సుపరిపాలన అందిస్తోందన్నారు. ఇప్పటివరకు ఎలా కష్టపడ్డారో రాబోయే మూడేళ్లు కూడా పార్టీ శ్రేణులందరూ అంతే అంకిత భావంతో పని చేయాలని ఆయన కోరారు.

### సూపర్ సిక్స్.. సూపర్ హిట్

సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని, 16 వేలమంది ఉపాధ్యాయులకు మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగ కల్పన జరిగిందని, 6వేల మంది కానిస్టేబుల్ ఉద్యోగాలను ప్రత్యక్షంగా నియమించడం జరిగిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని టీడీపీ నేత, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. నెల్లూరు రూరల్ శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, 12 సంవత్సరాలుగా తాను శాసన సభ్యునిగా ఉన్నానని, పది సంవత్సరాలుగా చూడని అభివృద్ధి గత రెండు సంవత్సరాలలో చూడడం జరిగిందని ఆయన తెలిపారు. రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధిని సాధించిందని కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా ప్రగతి పథంలో దూసుకుపోతోందన్నారు. శాసన మండలి సభ్యులు బీద రవిచంద్ర మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాలుగా సంక్షేమం అభివృద్ధి మరియు పరిశ్రమల కల్పనకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషికి ప్రధాని నరేంద్ర మోడీ సహకారం ఉందన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ పరిపాలనను ప్రజల చెంతకు తీసుకువస్తున్నారని అన్నారు. కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్, ఆర్టీసీ జోనల్ ఛైర్మెన్ సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## భూ అక్రమార్కులపై..

# ఎమ్మెల్యే కోటంరెడ్డి మండిపాటు

### కఠిన చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు ఆదేశాలు



నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో భూఅక్రమాలకు పాల్పడేవారికి ఇక చుక్కలు కనపడనున్నాయి. ఎంతోమంది కాయకష్టం చేసి కొనుగోలు చేసిన భూములను కొందరు భూఅక్రమార్కులు దొంగ పట్టాలు సృష్టించి, వాటిని ఇతరులకు అమ్మి కోట్లు సొమ్ము చేసుకుంటున్నారు. రూరల్ పరిధిలో ఇటీవల కొన్ని ఘటనలకు సంబంధించి బాధితులు ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి ఆ విషయాలన్నీ కోటంరెడ్డికి తెలియజేసి, తమకు న్యాయం చేయాలని విన్నవించారు. తాము ఎంతో కష్టపడి స్థలాన్ని కొనుగోలుచేస్తే రూరల్‌లో భూ అక్రమార్కులు చెలరేగిపోతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వచ్చారు. వెంటనే, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి నెల్లూరురూరల్ పోలీస్ ఉన్నతాధికారులు, రెవెన్యూ అధికారులతో స్వయంగా మాట్లాడారు. ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టిస్తున్న వారిని, భూ అక్రమాలకు పాల్పడేవారిని ఉపేక్షించవద్దని, వారిపై ఉక్కుపాదం మోపి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో స్పందించిన రెవిన్యూ పోలీస్ అధికారులు భూఅక్రమార్కులను గుర్తించి వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు.







## మంత్రి ఆనం కృషితో..
# గురుకుల పాఠశాల అప్‌గ్రేడ్!



రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక కృషితో ఆత్మకూరు నియోజకవర్గంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో, మెట్ట ప్రాంతానికి చెందిన విద్యార్థినులకు ఇంటర్ విద్యను స్థానికంగానే అభ్యసించే అవకాశం లభించింది. ఈ జూనియర్ కళాశాలలో ఎం.పి.సి., బై.పి.సి. గ్రూపులను ప్రారంభించనున్న నేపథ్యంలో వైద్య, ఇంజినీరింగ్, సైన్స్ రంగాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే గ్రామీణ బాలికలకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థినులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నాణ్యమైన విద్యను పొందే అవకాశం ఏర్పడింది. ఆత్మకూరు నియోజకవర్గంలో బాలికల విద్యాభివృద్ధికి మంత్రి ఆనం ఎప్పటి నుంచో విశేష కృషి చేస్తున్న విషయం తెలిసిందే. గతంలో ఆయన మంత్రిగా పనిచేసిన సమయంలోనే గ్రామీణ ప్రాంత బాలికలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో గురుకుల పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయాల ఏర్పాటుకు, వేలాది మంది విద్యార్థినులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించారు. అదేవిధంగా నెల్లూరు జిల్లా గొలగమూడిలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలను కూడా జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు బీసీ గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా, అందులో రెండు విద్యాసంస్థలు నెల్లూరు జిల్లాకు దక్కడం విశేషం. జిల్లా విద్యా అభివృద్ధికి ఇది మరో మైలురాయిగా నిలుస్తుందని విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# యూరియా కోసం రైతుల ఎదురుచూపు

యూరియాకి కొరత లేదని, జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెప్తున్నా, అనేక ప్రాంతాల్లో ఆ ఎరువు అందుబాటులో ఉండడం లేదు. జిల్లాలో పంటల అల్లూరుగా ప్రసిద్ధి గాంచిన అల్లూరు మండలంలో కూడా యూరియా కోసం రైతులు ఎదురుతెన్నులు చూస్తూనే ఉన్నారు. అందులో ఈ మండలంలో వరి సాగు ఎక్కువ. అయితే, ఎరువులు మాత్రం అవసరానికి దొరకడం లేదని రైతులు వాపోతున్నారు. ఈనెల 17న వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద అనేకమంది రైతులు యూరియా కోసం వేచి ఉన్నా, సకాలానికి సంబంధిత అధికారులెవరూ అందుబాటులో లేరంటూ నిరాశగా వెనుదిరిగారు.

## నెల్లూరు బిఎస్ఎన్ఎల్..
# రాష్ట్రంలో నెంబర్ వన్!

నెల్లూరు బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ రాష్ట్రంలో నెంబర్ వన్ స్థానంలో ఉందని నెల్లూరు ఎంపీ, టెలికాం అడ్వైజరీ కమిటీ ఛైర్మెన్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులోని బిఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో నూతనంగా 28 సెల్ టవర్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. 82 సెల్‌ఫోన్ టవర్లు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ప్రత్యేకంగా ఉదయగిరి నియోజకవర్గానికి 34 సెల్ ఫోన్ టవర్లు ఏర్పాటుకు అనుమతులు వచ్చాయన్నారు. ప్రస్తుతం 60శాతం అందుబాటు ఉన్నచోట మాత్రమే బిఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. కేంద్రప్రభుత్వం 90 శాతం అందుబాటు ఉండేచోట కూడా సెల్‌ఫోన్ టవర్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిందన్నారు.

## రొట్టెల పండుగ
# ఏర్పాట్ల పరిశీలన

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని బారాషాహీద్ దర్గాలో రొట్టెల పండుగ ఏర్పాట్లపై తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ నెల 23వ తేదీ కల్లా అన్ని ఏర్పాట్లను పూర్తిచేస్తామని, 26 నుంచి 30వ తేదీ వరకు జరిగే రొట్టెలపండుగకు వచ్చే లక్షలాదిమంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను చేస్తున్నామని, మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో అందరం కలిసి రొట్టెల పండుగను విజయవంతం చేస్తామన్నారు.



గాండ్ల తెలికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 18వ తేదీ గురువారం నెల్లూరులో డెడికేటెడ్ కమిషన్ ఛైర్మెన్ రాజీవ్ రంజన్ మిత్రాకి రాష్ట్ర గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం పక్షాన వినతిపత్రం అందిస్తున్న రాష్ట్ర శాఖ అధ్యక్షులు గ్రోసు సుబ్బారావు, పక్కన గౌరవ అధ్యక్షులు తిరుపతి హరగోపాల్, ఉపాధ్యక్షులు వరికుంట్ల సురేష్‌బాబు (రాజా) తదితరులు.

# స్వర్ణాల చెరువు వద్ద..'యోగాంధ్ర'



యోగాసనాలు సాధన చేస్తున్న జేసీ వెంకటేశ్వర్లు, మేయర్ సుజాత, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ


యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత సాధ్యమవుతాయంటూ నెల్లూరు నగరంలోని స్వర్ణాల చెరువు ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇరుకళలమ్మవారి ఆలయం సమీపంలో నిర్వహించిన యోగా కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అధిక సంఖ్యలో యోగాభ్యాసకులు పాల్గొని యోగాసనాలు ఆచరించడంతో ఆ ప్రాంతం యోగసాధకులతో కళకళలాడింది. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ శ్రీమతి దేవరకొండ సుజాత, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21న నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించనున్న భారీ సామూహిక యోగా కార్యక్రమంలో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లా నలుమూలలకు విస్తరించేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ, జిల్లా పరిషత్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయస్థాయి యోగా కోచ్ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాసనాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అవెన్యూ, రెయిన్‌బో పాఠశాలల విద్యార్థులు హేమిత, తన్మయి, తన్వి, తేజ ప్రదర్శించిన యోగాసనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యోగాలో బంగారుపతకాలు సాధించిన యోగా మాస్టర్లు ప్రసన్న, కావ్య, యోగాభ్యాసకులు నీరజ, తేజతో పాటు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జాయింట్ కలెక్టర్ ఘనంగా సత్కరించారు.

# 8.74 కోట్లతో వేదగిరి క్షేత్రం అభివృద్ధి

నెల్లూరు రూరల్ మండలంలోని ప్రసిద్ధమైన వేదగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు 8.74 కోట్ల రూపాయలతో అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. త్వరలో ఆమేరకు పనులు చేపట్టేందుకు టెండర్లు పిలవనున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖ చీఫ్ ఇంజనీర్ జీవీఆర్ శేఖర్ తెలిపారు. దేవాదాయశాఖ స్థపతి పరమేశ్వరప్పతో కలిసి ఆయన ఈనెల 16న వేదగిరి క్షేత్రం పరిసరాలను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గిరిధర్‌రెడ్డిల కోరిక మేరకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సీజీఎఫ్ (సర్వశ్రేయోనిధి) నిధులను దేవాలయ అభివృద్ధికి కేటాయించారని తెలిపారు. వేదగిరిపై గోవిందరాజస్వామి ఆలయ పునర్నిర్మాణం, మహాకళ్యాణ వేదిక నిర్మాణం, మెట్ల మార్గంలో భక్తులకు డార్మెటరీ, ధ్యానమందిరం, పార్కులో నిత్యాన్నదాన భవన సముదాయాల నిర్మాణ స్థలాలను వారు పరిశీలించారు. ఆయనతో పాటు, ఆలయ ఇఒ గోపి, దేవాదాయశాఖ అధికారులు ఆ మేరకు పరిశీలనలు చేశారు.

# చాముండేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలు 21 నుంచి

ఇందుకూరుపేట మండలం గంగపట్నం గ్రామంలో వెలసివున్న శ్రీ చాముండేశ్వరిదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 21 నుంచి ప్రారంభమై, జులై 2వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు కనుక, ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.



రెడ్ క్రాస్ కార్యాలయంలో జరిగిన ప్రపంచ రక్తదాతల దినోత్సవంలో పాల్గొన్న డిఆర్‌ఓ విజయకుమార్, రెడ్ క్రాస్ సభ్యులు

# రక్తదానమంటే.. ప్రాణదానమే!

**• డిఆర్‌ఓ విజయకుమార్**

రక్తదానమంటే ప్రాణదానమని, రక్తం అవసరమైన వారికి దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేసి ఆదుకోవాలని రెడ్ క్రాస్ స్పెషల్ ఆఫీసర్, జిల్లా రెవిన్యూ అధికారి యన్.విజయ్‌కుమార్ కోరారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 14న నెల్లూరులోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి మరియు రక్త గ్రూపులను కనుగొన్న శాస్త్రవేత్త కార్ల్ ల్యాండ్‌స్టీనర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జిల్లా ప్రజల ఆరోగ్య పరిరక్షణలో రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అడిషనల్ డీఎంఅండ్ హెచ్‌ఓ ఖాదర్‌వలి, రెడ్ క్రాస్ సెక్రెటరీ మస్తానయ్య, రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డా. వరప్రసాద్ రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ మాజీ సభ్యులు యాలమూరి రంగయ్యనాయుడు, డా. ఏ.వి సుబ్రహ్మణ్యం, స్వచ్ఛంధ రక్తదాత తిక్కవరపు సుకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అత్యధిక సార్లు రక్తదానం చేసిన 61 మంది రక్తదాతలను సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో అత్యధికంగా 130 సార్లు రక్తదానం చేసిన రక్తదాత మదనపల్లి మధుసూదన్‌రావును, 119సార్లు రక్తదానం చేసిన రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ మాజీ కన్వీనర్ సి.హెచ్. అజయ్‌బాబును అభినందించి సత్కరించారు.

# వైసీపీ పాలనలో బీసీల అణచివేత

**టీడీపీ నేత చెముకుల విమర్శ**

వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చారని, ప్రత్యేకించి జగన్మోహన్‌రెడ్డి బీసీలకు తీరని ద్రోహం చేశారని తెలుగుదేశం పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణచైతన్య దుయ్యబట్టారు. ఈనెల 16న ఆయన నెల్లూరులోని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు కేవి శేషయ్య, ఎద్దలపూడి నాగరాజు, ఆవుల వాసు, రవిచంద్ర, శ్రీకాంత్ గౌడ్, వావిళ్ల బాస్కర్‌లతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ పాలనలో రేపల్లె నియోజకవర్గంలో అమర్నాథ్ గౌడ్ అనే పదో తరగతి పిల్లాడిని వైసీపీ నేతల ప్రోద్బలంతో కొందరు యువకులు పెట్రోల్ పోసి తగులబెట్టి హతమార్చారని, ఆ దారుణమైన సంఘటనకు నేటికి మూడేళ్లు పూర్తి అయిందని అన్నారు. వైసీపీ పాలనలో లెక్కలేనన్ని దారుణాలు జరిగాయన్నారు.

# కేంద్ర పథకాల అమలులో వేగం పెంచాలి

**దిశా సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి**




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పక్కన జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ హిమాన్షు శుక్ల

జిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పథకాలు, కేంద్ర నిధులతో అమలవుతున్న కార్యక్రమాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, ఆ పథకాల అమలులో వేగం పెంచాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) పిలుపునిచ్చారు. ఈనెల 15న స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశా) సమావేశం నిర్వహించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, నగర మేయర్ సుజాత, జెడ్పి సీఈవో శ్రీధర్‌రెడ్డి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో విపిఆర్ మాట్లాడుతూ, అందుబాటులో ఉన్న కేంద్ర పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే జిల్లాకు మరింత నిధులు, అభివృద్ధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని బుజబుజ నెల్లూరు, కనుపర్తిపాడు జంక్షన్ల వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్లను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని జాతీయ రహదారుల అధికారులను కోరారు.

# శ్రీసిటీని సందర్శించిన..ట్రైనీ ఐఏఎస్‌లు



ఏపీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా ఇటీవల 2025 బ్యాచ్‌కి చెందిన 8 మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు ఇటీవల శ్రీసిటీలో పర్యటించారు. శ్రీసిటీ పరిసరాలు, పారిశ్రామిక ప్రగతిని వీక్షించిన వీరు, స్థానిక మొండెలెజ్ పరిశ్రమను సందర్శించి ఉత్పత్తులు, ఇతర సాంకేతిక అంశాలను పరిశీలించారు.



# విద్యార్థులకు.. ఉపకరణాలు పంపిణీ



విద్యార్థికి ఉపకరణాన్ని అమరుస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

జిల్లాలోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అవసరమైన ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నెల్లూరులో ఈనెల 17న జరిగింది. జిల్లా పాఠశాల విద్య మరియు సమగ్ర శిక్ష శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఉపకరణాలను అందజేశారు. ఈ శాఖల నేతృత్వంలో 38 మండల భవిత సెంటర్లలో 2748 ప్రత్యేక అవసరాలు కలిగివున్న విద్యార్థులకు విద్యాబోధన మరియు సౌకర్యాల కల్పన నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరులో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పాల్గొని మాట్లాడుతూ, 76 మంది సహిత విద్యా రిసోర్స్ పర్సన్‌లు, 680 మంది విద్యార్థులకు నిరంతర ప్రాథమిక విద్యా మరియు ఫిజియోథెరపీ సేవలను దివ్యాంగ విద్యార్థులకు అందించడం జరుగుతోందని తెలిపారు. నేడు 394 మంది విద్యార్థులకు రూ.22.14 లక్షల వ్యయంతో పాఠశాల విద్యా మరియు సమగ్ర శిక్ష శాఖల ద్వారా బ్యాటరీ ఆపరేటెడ్ సైకిళ్ళు, బ్రెయిలీ కిట్లు, సి.పి.వీల్‌చైర్స్, రొలేటర్లు, త్రీ వీలర్ సైకిళ్ళు, వీల్‌చైర్లు, మడత వీల్‌చైర్లు అందిస్తుండడం సంతోషకరమన్నారు.

# సోమశిల ఆఫ్రాన్‌ని నిర్మించాలి

**బీజేపీ నేత మిడతల వినతి**

సోమశిల డ్యామ్‌కి సంబంధించి దెబ్బతిన్న ఆఫ్రాన్‌ని నిర్మించాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈనెల 15న ఆయన ఆమేరకు నెల్లూరులో సోమశిల పర్యవేక్షక ఇంజనీర్ బీవీ రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. సోమశిల ఆఫ్రాన్ నిర్మాణ పనులు నిధుల కొరత కారణంగా అర్ధాంతరంగా నిలిచిపోయాయని, ప్రభుత్వం వెంటనే పరిశీలించి నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు.

# నెల్లూరు కబుర్లు

## విద్యార్థినులకు.. ప్రశాంతమ్మ ఆర్థిక సాయం



విద్యార్థినికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ప్రతిభావంతులైన పలువురు విద్యార్థినులకు ప్రోత్సాహంగా ఇటీవల కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నెల్లూరులోని తమ నివాసంలో ఆర్థిక సాయం అందజేశారు. విపిఆర్ విద్య పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఉన్నత చదువుల కోసం చెక్కులను అందజేశారు. విపిఆర్ విద్య పాఠశాలలో పదో తరగతిలో 594 మార్కులు సాధించిన చింతాడ మానస అనే విద్యార్థిని ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుకునేందుకు కళాశాల ఫీజుల నిమిత్తం ఎమ్మెల్యే ఆ నగదును చెక్కు రూపంలో అందజేసి అభినందించారు. అదేవిధంగా, గత సంవత్సరం ఇదే పాఠశాలలో ప్రతిభ కనబరిచిన పి.గాయత్రి అనే మరో విద్యార్థిని ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువును కొనసాగించేందుకు ఏడాదిపాటు కళాశాల ఫీజులనిమిత్తం చెక్కును అందజేశారు.

## గంజాయికి వ్యతిరేకంగా పనిచేయాలి

యువత మత్తు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, గంజాయికి వ్యతిరేకంగా పనిచేయాలని నాయకులు సూచించారు. గంజాయికి వ్యతిరేకంగా పోరాడి అసువులు బాసిన సీపీఎం నాయకుడు పెంచలయ్య జయంతి సందర్భంగా ఈనెల 16న ఆర్టీటీ కాలనీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 87 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు.

# జయభారత్ ఆసుపత్రికి.. 10 లక్షల విరాళం

- కంటిరోగులకు అండగా బెజవాడ కుటుంబం



బాలు సుబ్బారావుకి దాతల విరాళం చెక్కుని అందజేస్తున్న పొన్నలూరు సీతారామిరెడ్డి

నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రివారు పేద రోగులకు అందజేస్తున్న కంటిపరీక్షలు, శస్త్రచికిత్సలను అభినందిస్తూ, ఆ వైద్య సేవలు మరింత విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ హైదరాబాద్‌కి చెందిన దాతలు ఇటీవల 10 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. హైదరాబాద్ వాస్తవ్యులైన బెజవాడ శ్రీకృష్ణారెడ్డి 90వ జన్మదిన సందర్భంగా, వారి తల్లి బెజవాడ బుజ్జమ్మ జ్ఞాపకార్థం సునీల్ కన్స్‌ట్రక్షన్స్ (హైదరాబాద్) వారు జయభారత్ హాస్పిటల్‌లోని బెజవాడ రామచంద్రరెడ్డి కంటి విభాగానికి ఆసుపత్రి ఛైర్మెన్ పొన్నలూరు సీతారామిరెడ్డి ద్వారా హాస్పిటల్ వైస్ ఛైర్మెన్ బాలు సుబ్బారావుకు ఆ విరాళం చెక్కును ఇచ్చారు. ఉచిత కంటి అపరేషన్లకు రూ.5లక్షలు, కంటి వైద్య పరికరం ఆటో టోనోమీటర్ కొనుగోలు కోసం మరో రూ.5 లక్షలు వెచ్చించనున్నట్లు సీతారామిరెడ్డి తెలిపారు. దాతలు అందజేసిన ఈ మొత్తంతో 250 మంది పేదవారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. గతంలో కూడా కృష్ణారెడ్డి.. వారి కుటుంబసభ్యులు కంటి విభాగానికి అపార సహాయ సహకారాలు అందచేశారని ఈ సందర్భంగా దాతలకు ఆసుపత్రి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. దాత బెజవాడ కృష్ణారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జయభారత్ ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ద్వితీయ వర్ధంతి



జననం 1929

నిర్యాణం 2024

ప్రేమానురాగాలు పంచిన అమృతమూర్తి

శ్రీమతి కొండ్లపూడి శేషమ్మ గారు

పరిపూర్ణ జీవితం సాగించి, మాకు దూరమై

22-06-2026 నాటికి రెండేళ్ళు గడవనున్న సందర్భంగా

ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

కుమారులు

కొండ్లపూడి నరసారెడ్డి

కొండ్లపూడి సుధాకర్‌రెడ్డి

కుమార్తె

సోమవరపు ఝాన్సీరెడ్డి


# రక్తదానంతో బాధితులను ఆదుకోవాలి

**బీజేపీ నేత కర్నాటి ఆంజనేయరెడ్డి పిలుపు**



సత్కారాలనందుకున్న రక్తదాతలు

రక్తాన్ని తయారు చేయలేమని, అదేమీ మార్కెట్ వస్తువు కాదని భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి చెప్పారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఈనెల 14న స్థానిక పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు రత్నమ్మ చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరులోని మినీ టౌనుహాలులో రక్తదానం విశిష్టతపై కవిసమ్మేళనం, 'రక్తదాత సుఖీభవ' అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానం ప్రాధాన్యతను వివరించారు. రక్తదానమంటే ప్రాణదానమని, బాధితులకు రక్తదానం చేయడమంటే వారి ప్రాణాలను కాపాడినట్లేనన్నారు. పొలిటికల్ అనలిస్ట్ యనమల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రమాదాలు, శస్త్ర చికిత్సలు, ప్రసవం వంటి సమయాల్లో రక్తం అవసరం అవుతుందని, అలాంటి వాళ్ళ ప్రాణాలు నిలిపేందుకు యువత ముందుకు వచ్చి సేవాభావంతో రక్తదానం చేయాలని కోరారు. అనంతరం రక్తదాతలు పేరిసెట్ల వెంకటేశ్వర్లు, బిల్లా వంశీ కృష్ణ, దారా దినేష్ కుమార్, నాదెండ్ల చైతన్య, దొంతి సాయి నిఖిల్, పి.ధనశేఖర్ లను 'రక్తదాత సుఖీభవ' అవార్డులతో సత్కరించారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీమోహన్ రాజు సభాధ్యక్షులుగా వ్యవహరించారు. పలువురు కవులు, రక్తదాతలు పాల్గొన్నారు.

## బాలలకు అక్షరాభ్యాసాలు

నెల్లూరు పప్పులవీధిలోని శ్రీసౌభాగ్య సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఈనెల 17న 3, 5 సంవత్సరాల బాలలకు బ్రహ్మశ్రీ ఆలూరు శిరోమణిశర్మ దంపతులచే అక్షరాభ్యాసాలు నిర్వహించారు. 25 మంది చిన్నారులకు అక్షర స్వీకారం చేయించామని, కుర్తాళం పీఠాధిపతులవారి ఆశీస్సులతో ఈ కార్యక్రమం చేపట్టామని వారు తెలిపారు. నెల్లూరులో శ్రీ రాయప్రోలు చంద్రశేఖర శర్మ పిల్లలకు ఉచితంగా పలక, బలపాలు అందజేశారంటూ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరాజు భవానీ ప్రసాద్‌రావు, దేవాలయ శ్రీకార్యం దంపతులు పాల్గొన్నారు.

## అనగుంటలో కార్డన్ సర్చ్

నెల్లూరు నగరంలోని అనగుంటలో ఈనెల 16న పోలీసులు కార్డన్ సర్చ్ నిర్వహించారు. వేదాయపాళెం ఇన్స్‌పెక్టర్ కె. శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి ఆ ప్రాంతంలోని ఇంటింటినీ తనిఖీ చేశారు. ఇళ్ళల్లో నివాసం ఉంటున్నవారి వివరాలను సేకరించారు. సరైన పత్రాలు లేని 17 ద్విచక్రవాహనాలను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. అయిదుగురు రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. నేరాల నియంత్రణకు, శాంతిభద్రతల పరిరక్షణకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని, అసాంఘిక కార్యక్రమాలు, మాదకద్రవ్యాల వినియోగం వంటి సమాచారం తెలిస్తే, పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు.

# మంత్రి నారాయణ బర్త్‌డే సంబరాలు



మంత్రి నారాయణ బర్త్‌డే కేక్‌ని కట్ చేస్తున్న ఆయన సతీమణి రమాదేవి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మేయర్ సుజాత, వక్ఫ్‌బోర్డ్ ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్ తదితర నాయకులు

మంత్రి నారాయణ 69వ జన్మదిన వేడుకలు నెల్లూరు సిటీ నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల సంబరాల మధ్య ఇటీవల ఘనంగా జరిగాయి. చింతారెడ్డి పాలెంలోని నారాయణ మెడికల్ కాలేజ్ ప్రాంగణంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీశ్రీశ్రీ వేంకటేశ్వరస్వామి దేవ స్థానంలో మంత్రి సతీమణి పొంగూరు రమాదేవి, అల్లుడు గంటా రవితేజ, కుటుంబసభ్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత జిల్లా టీడీపీ కార్యాలయంలో పార్టీ నేతలు బాలాజీ, జమీర్, తిరుమల నాయుడు ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. మంత్రి నారాయణ చిత్రపటానికి డ్రోన్ ద్వారా పాలాభిషేకం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మంత్రికి శుభాకాంక్షలు చెప్తూ, 69 కేజీల భారీ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచారు.ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, మేయర్ సుజాత, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్‌యాదవ్, నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు.

## డిఎస్ఆర్ పాఠశాలలో..

మంత్రి నారాయణ పుట్టినరోజు వేడుకలు నెల్లూరు మూలాపేటలోని డీఎస్సార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సంబరంగా జరిగాయి. తమ పాఠశాలను కార్పొరేట్ స్థాయికంటే మించి అద్భుతంగా తీర్చిదిద్దిన మంత్రికి చిన్నారులంతా 'థాంక్యూ సార్' అంటూ ప్లకార్డులు ప్రదర్శించి ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు,ఉపాధ్యాయులు నిర్వహించిన ఈ జన్మదిన వేడుకల్లో మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి, అల్లుడు గంటా రవితేజ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి వారు సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సతీమణి రమాదేవి మాట్లాడుతూ, పేద పిల్లలకు చదువును మించిన ఆస్తి మరొకటి లేదని, దానినే వారికి బహుమతిగా ఇవ్వాలని నారాయణ సార్ దృఢంగా సంకల్పించారని చెప్పారు.

కేవలం నెల్లూరులోనే కాకుండా అమెరికా, జర్మనీ, లండన్, సింగపూర్‌లలో సైతం మంత్రి జన్మదిన వేడుకలను అభిమానులు నిర్వహించడం విశేషం.

# రామతీర్థంలో వేమిరెడ్డి దంపతుల యోగాసనాలు



రాష్ట్ర ప్రజలందరూ యోగాను ఒక రోజు కార్యక్రమంగా కాకుండా, తమ దైనందిన జీవితంలో ఒక భాగం చేసుకొని జీవన విధానంగా మార్చుకోవాలని, ఉన్నతమైన ఆలోచనతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు యోగాంధ్ర కార్యక్రమం చేపట్టారని కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21)ను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగంగా విడవలూరు మండలం రామతీర్థం సాగరతీరం వద్ద మంగళవారం నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. యోగాలోని ప్రతి ఆసనం ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలను యోగా గురువు డా.స్వప్న వివరించారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తదితరులు యోగాసనాలు సాధన చేశారు.

# ఆగస్టులో.. పొట్టేపాళెం బ్రిడ్జి!



కలుజు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని పొట్టేపాళెం బ్రిడ్డి పనులు వేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఆగస్టులో దానిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు కూడా. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఈ బ్రిడ్డి నిర్మాణం త్వరలోనే పూర్తికానుండడంతో, ఏళ్ల నాటి తమ కల సాకారం కాబోతోందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 5 కోట్ల 60 లక్షల రూపాయలతో జరుగుతున్న పొట్టేపాలెం కలుజుపై బ్రిడ్జి నిర్మాణ పనులను ఇటీవల తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో పొట్టేపాళెం కలుజు మీద శాశ్వతప్రాతిపదికన బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. ఇక్కడ బ్రిడ్జి లేకపోవడంతో ప్రజలు, వాహనదారులు ఎన్నో సమస్యలను ఎదుర్కొనేవారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ సమస్యలన్నిటికీ పరిష్కారంగా బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టడం జరుగుతోందన్నారు. వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ ఇందుపూరు అచ్యుత్‌రెడ్డి, ఎంపీటీసీ నేరెళ్ల నారాయణ, హరియాదవ్, బాలకృష్ణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.




కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' వార్తాపత్రిక

లాయర్ 45 YEARS

నాలుగున్నర దశాబ్దాలుగా
వారం వారం అక్షర సమరం సాగిస్తూ..
నెల్లూరీయులను అలరిస్తున్న
లాయర్
వార్తాపత్రికకి
45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

దువ్వూరు మధుసూదన్‌రెడ్డి
దువ్వూరు శిరీష్‌కుమార్‌రెడ్డి
దువ్వూరు సతీష్‌కుమార్‌రెడ్డి
హైదరాబాదు

## ఇచ్చిన హామీలను..

# నెరవేర్చని కూటమి నేతలు

### పర్వతరెడ్డి ఆధ్వర్యంలో నిరసన




నిరసన కార్యక్రమంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

టీడీపీ నేతలు అలివికాని హామీలిచ్చి.. నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారంటూ వైసీపీ నేత, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. చంద్రబాబు రెండేళ్ల పాలన వెన్నుపోటు పాలన అంటూ నిరసిస్తూ..ఇటీవల నెల్లూరు నగరంలో ఆయన ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీర్యాలీ చేపట్టారు. వీఆర్సీ గ్రౌండ్స్ నుంచి ప్రారంభమైన ర్యాలీ.. గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా తిరిగి వీఆర్సీ సెంటర్ చేరుకుంది. ఈ ఆందోళనలో పర్వతరెడ్డి మాట్లాడుతూ, మెగా డీఎస్సీలో అక్రమాలకు తెర తీశారని, మెగా డీఎస్సీని దగా డీఎస్సీగా మార్చి... నిరుద్యోగులను నట్టేట ముంచారని ఆయన ఆరోపించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా వారి జీవితాలను రోడ్డు మీదకు నెట్టారని, మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు 1500 రూపాయలు ఇస్తామని చెప్పి మోసం చేశారని విమర్శించారు. నిరుద్యోగ భృతి కింద రూ. 3వేలు చొప్పున 30లక్షల మంది యువతకు ఇస్తామని చెప్పి.. నేటికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. అలాగే 50 ఏళ్లకే మహిళలకు పెన్షన్.. ఇస్తామని చెప్పిన హామీ.. అటకెక్కిందని, వృద్ధులకు, ఒక్క కొత్త పెన్షన్ కూడా మంజూరు చేసిన దాఖలాలు లేవని ఆయన దుయ్యబట్టారు. గత ఐదేళ్ల జగన్మోహన్ రెడ్డి పాలనలో చెప్పిన వాటిని చెప్పినట్టు చేశారని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేశారని, మళ్లీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలన్న ఆకాంక్ష ప్రజల్లో ఉందన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






లాయర్ 45 YEARS

కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' వార్తాపత్రిక

కీ॥శే॥ నలుబోలు మల్లయ్యనాయుడు గారు
ప్రముఖ వ్యాపారవేత్త

నలభై అయిదేళ్ళ సుధీర్ఘ అక్షర ప్రస్థానంతో
నెల్లూరీయుల హృదయాలలో చెరగని స్థానం పొందిన
లాయర్
వార్తాపత్రికకి
45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.



నలుబోలు బలరామయ్యనాయుడు
వాకర్స్ ఇంటర్నేషనల్ 203 డిస్ట్రిక్ట్ గవర్నర్ - 2026
ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మెన్, నెల్లూరు.




## విద్యారంగంలో

# ఆణిముత్యం..ఎన్‌బీకేఆర్

### • 47ఏళ్ళుగా విద్యార్థుల భవితకు బాటలు

నెల్లూరు జిల్లా కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకెఆర్ ఐఎస్టీ.. విద్యా ప్రమాణాలకి నిలయంగా రాణిస్తూ.. విద్యారంగంలో ఆణిముత్యంగా అందరి అభినందనలు అందుకుంటోంది. దాదాపు 47 సంవత్సరాలుగా ఈ విద్యాలయం చదువుల తల్లి నిలయంగా ఉంటూ, వేలాదిమంది విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుతూనే ఉంది.

#### 1979లో ఆవిర్భావం

జిల్లాలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా ఖ్యాతి చెందిన ఎన్‌బీకేఆర్ కళాశాల ఈనాటిది కాదు. సుమారు 47 సంవత్సరంల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండవ ఇంజనీరింగ్ కళాశాలగా ఎన్‌బీకెఆర్ ఐఎస్టీ స్థాపించబడింది. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి తనయుడు, ప్రస్తుత కళాశాల కరెస్పాండంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కళాశాల దినదినప్రవర్ధమానం అవుతూనే ఉంది. ఈ కళాశాలలో కోర్సుల వారీగా భవనాలు మరియు లేబొరేటరీలు అన్నీ ఉన్నాయి. ప్రత్యేకంగా కంప్యూటర్ సైన్సు మరియు ఇంజనీరింగ్ బ్రాంచ్ విద్యార్థుల కోసం కొరకు అధునాతనమైన వసతులుతో పాటు, దాదాపు 30 కోట్లతో నిర్మించిన భవనం, కంప్యూటర్ లాబ్స్ అన్నీ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

#### ఏ-గ్రేడ్ కళాశాలగా ప్రభుత్వ గుర్తింపు

ఎన్‌బికెఆర్ కళాశాలకి స్వయంప్రతిపత్తి హోదా (అటానమస్ స్టేటస్)తో పాటు, ప్రతిష్టాత్మకమైన ఎన్‌బీఎ, ఎన్ఏఏసి (న్యాక్) గుర్తింపులు ఉన్నాయి. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏ-గ్రేడ్ కళాశాలగా కూడా గుర్తింపు పొందడం విశేషం. అనుభవజ్ఞులు, పీహెచ్‌డీ-ఎంటెక్ విద్యార్హతలు కలిగిన అధ్యాపకులతో విద్యాబోధన ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ప్రత్యేకత. అంతేకాదు, మొదట సంవత్సరం నుంచి ప్లేస్‌మెంట్ కోసం బైటెక్సెల్ కంపెనీ ట్రైనర్స్‌తో ప్రత్యేక శిక్షణ కూడా ఇస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో అనేక బహుళ జాతి కంపెనీలు జరిపిన ప్రాంగణ ఎంపికలలో ఎంపికైన విద్యార్థులలో దాదాపు 70శాతం విద్యార్థులు ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ విద్యార్థులు కావడం విశేషం.

#### అధునాతన వసతులు

తల్లితండ్రుల కోరిక మేరకు, విద్యార్థుల సౌకర్యార్థం జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి ఈ కాలేజీకి బస్సు సౌకర్యం కూడా ఏర్పాటుచేశారు. కళాశాల ప్రాంగణంలోనే విద్యార్థులకు సంవత్సరాల వారీగా విడిగా హాస్టల్ సౌకర్యం కూడా ఉంది. విద్యార్థినులకు భద్రతా ఏర్పాట్లతో పాటు సురక్షితమైన హాస్టల్ వసతి ఉన్నాయి. కళాశాల విద్యార్థులను క్రీడా రంగంలో కూడా ప్రోత్సహించేందుకు 14 ఎకరాల స్థలాన్ని ఇండోర్ మరియు అవుట్ డోర్ గేమ్స్ కోసం కేటాయిచారు. ఎన్‌సీసీ, ఆర్మీ మరియు నావల్ వింగ్‌లు కూడా ఇందులో ఉన్నాయి. ప్రతిభ కలిగిన విద్యార్థులకు ట్యూషన్ ఫీజులో రాయితీ కల్పించి పేద విద్యార్థులకు వెలుగుబాటలు వేస్తూ, శ్రీ నేదురుమల్లి ఫౌండేషన్ ద్వారా తమవంతు సేవలందిస్తోంది.



# నిస్వార్థ రాజకీయాలకు ప్రతీక..స్వర్ణ వేమయ్య

### • వర్ధంతి సభలో సీపీఐ నాయకుల నివాళి



సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే స్వర్ణ వేమయ్య త్యాగానికి, నిస్వార్థ రాజకీయాలకు ప్రతీకగా నిలిచారని సీపీఐ నాయకులు కొనియాడారు. స్వర్ణ వేమయ్య 31వ వర్ధంతి సందర్భంగా ఇటీవల నెల్లూరులోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సభ జరిగింది. జిల్లా కార్యదర్శి అరిగెల సాయి అధ్యక్షతన జరిగిన ఈ సభలో తొలుత, సీపీఐ సీనియర్ నాయకుడు వి.రామరాజు పాల్గొని స్వర్ణ వేమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీపీఐ పార్టీ తరఫున స్వర్ణ వేమయ్య నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడారని గుర్తు చేశారు. పేదలు, రైతులు, వ్యవసాయ కార్మికులు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజల పక్షాన పోరాడే నాయకులకు ఆయన జీవితం ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నందిపోగు రమణయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి యామాల మధు, సీపీఐ కార్యవర్గ సభ్యులు వినోదమ్మ, కొప్పోలు చిన అంకయ్య, సయ్యద్ సిరాజ్, మున్నా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లీలామోహన్ పాల్గొన్నారు.

## 'విపిఆర్ విద్యా'లయం..

# ఒక దేవాలయం!

**ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి**



విద్యార్థులకి విద్యా సామాగ్రి కిట్స్ పంపిణీ చేస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

నెల్లూరులోని 'వీపిఆర్ విద్య' విద్యాలయం..తమకు దేవాలయంతో సమానమని కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈ విద్యాలయాన్ని ప్రతిభ కలిగిన పేద విద్యార్థుల కోసమే స్థాపించారని ఆమె తెలిపారు. ఇటీవల నెల్లూరురూరల్ పరిధిలోని కనుపర్తిపాడులో ఉన్న విపిఆర్ విద్య పాఠశాలలో ఆమె విద్యార్థులకు స్కూల్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విపిఆర్ విద్య 2016లో స్థాపించామన్నారు. పిల్లల చదువు తల్లిదండ్రులకు భారం కాకూడదని విద్యాసామగ్రి, బస్సు సౌకర్యం, మధ్యాహ్న బోజనం వంటి వసతులు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. విపిఆర్ విద్య పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉన్నత చదువులు చదవాలని విపిఆర్ ఆశయమన్నారు. ఇప్పటివరకు ఎనిమిది బ్యాచ్‌ల విద్యార్దులు ఈ విద్యాలయంలో పదవ తరగతి పూర్తి చేసుకున్నారన్నారు. విద్యార్థులు ప్రతి ఏడాది పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధిస్తున్నారని, ఈ ఏడాది ఉత్తమంగా 594 మార్కులు వచ్చాయన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్దుల ఉన్నత చదువులకు తమ ప్రోత్సాహం ఉంటుందని, విపిఆర్ ఫౌండేషన్ తరపున వారిని చదివిస్తామని తెలిపారు. విపిఆర్ విద్య ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులకు విద్యాదానం జరగడం దేవుడిచ్చిన వరంలా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్దులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మూలస్థానేశ్వరాలయంలో..ప్రాకారోత్సవం

నెల్లూరు మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరాలయంలో ఈనెల 15న శివపార్వతులకు వైభవంగా ప్రాకారోత్సవం జరిగింది. అనంతరం పార్వతీ పరమేశ్వరులకు పల్లకిసేవ చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను తిలకించారు. ఆలయ నిర్వాహకులు పర్యవేక్షించారు.

# అత్యుత్తమ పారిశ్రామికవాడ..శ్రీసిటీ

## సీఐఐ కౌన్సిల్ సమావేశంలో ప్రశంసించిన ప్రముఖులు

దేశంలో అత్యుత్తమ పారిశ్రామిక నగరంగా శ్రీసిటీ రూపొందడం అభినందనీయమని పలువురు ప్రముఖులు కొనియాడారు. ఇటీవల కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌన్సిల్ రెండో సమావేశం ఇటీవల శ్రీసిటీలో జరిగింది. ఈ సమావేశంలో పరిశ్రమల సుస్థిరత, మార్కెట్ అవకాశాలు, పరస్పర సహకారం వంటి అంశాలపై పారిశ్రామికవేత్తలు చర్చించారు. స్వర్ణాంధ్ర–పీ4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ సి.కుటుంబరావు ముఖ్యఅతిథిగా పాల్గొని "భౌగోళిక రాజకీయ అనిశ్చితులు పరిశ్రమలపై చూపుతున్న ప్రభావం..వాటిని ఎదుర్కొనే వ్యూహాలు" అనే అంశంపై ప్రసంగించారు. దేశంలోనే ఉత్తమ పారిశ్రామిక క్లస్టర్‌గా శ్రీసిటీని ఆయన అభివర్ణిస్తూ, ఎల్‌జీ, డైకిన్, క్యారియర్ వంటి అంతర్జాతీయ సంస్థలు మరియు వాటి సరఫరా సంస్థల అభివృద్ధికి శ్రీసిటీ పారిశ్రామిక అనుకూల వాతావరణం ఎంతగానో దోహదపడుతుందన్నారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా పరిశ్రమలు వినూత్నత, అనుకూలత, ముందుచూపుతో కూడిన వ్యూహాలను అవలంబించాలని ఆయన సూచించారు. దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించి, సరఫరా గొలుసు వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) చీఫ్ మేనేజర్ సెంథిల్ మురుగన్ ఎస్ఎంఈ ఐపీఓలు, స్టాక్ మార్కెట్ లిస్టింగ్ అవకాశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. చిన్న, మధ్య తరహా సంస్థలు మూలధన మార్కెట్ల ద్వారా నిధులు సమీకరించి వేగంగా అభివృద్ధి చెందవచ్చని వివరించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో, సీఐఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి ఆతిథ్యం ఇవ్వడం ద్వారా సుస్థిర అభివృద్ధిలో శ్రీసిటీ పాత్ర ప్రతిబింబిస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల్లో కూడా శ్రీసిటీ పారిశ్రామికవేత్తలు విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి సామాజిక బాధ్యత కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. సమగ్ర అభివృద్ధి, సమాజ సాధికారతే శ్రీసిటీ లక్ష్యమని తెలిపారు. ఈ సమావేశంలో స్వర్ణాంధ్ర–పీ4 ఫౌండేషన్ డైరెక్టర్ సాంబ శివరాజు, సీఐఐ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ ఎస్.నరేంద్రకుమార్, వైస్ ఛైర్మన్ డాక్టర్ జి.సాంబశివరావు పాల్గొన్నారు.



సీఐఐ ప్రతినిధులతో స్వర్ణాంధ్ర-పీ4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ కుటుంబరావు







# గూడూరు డివిజన్

## శ్రీ ప్రసన్న వెంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు



ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్

గూడూరు, రాజావీధిలోని శ్రీశ్రీశ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో జూన్ 24వ తేదీ నుంచి జులై 4వతేదీ వరకు 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఇటీవల గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ నివాసంలో ఆయన చేతులమీదుగా బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను విడుదల చేసి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని బ్రహ్మోత్సవాల నిర్వాహకులకు సూచించారు. దేవస్థానం ఛైర్మెన్ శ్రీకంటి రామ్‌మోహన్‌రావు, కార్యనిర్వహణాధికారి రవికృష్ణ, ధర్మకర్త మండలి సభ్యులు అమరయ్యానాయుడు, గోపాల్, నాగేంద్ర, రవీంద్రబాబు, బాబు, సాయికృష్ణ, మునికోటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆర్టీవో అధికారుల స్పెషల్ డ్రైవ్

గూడూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఇటీవల పోలీసులు, ఆర్టీవో అధికారులు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని పలు ఆటోలకు చలానాలను విధించారు. ఒకటవ పట్టణ సీఐ శేఖర్‌బాబు, ఎస్సై శిరీష, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ శాంతి పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

### సి.ఐ.టి.యు డిమాండ్



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయాలని గూడూరు పట్టణంలోని లేబర్ కార్యాలయం ఎదుట ఈ నెల 15న భవన నిర్మాణ కార్మిక సంఘం సి.ఐ.టి.యు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగి మరణించిన, వికలాంగులుగా మారిన కార్మికుల కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయని, వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని, వెంటనే బిల్డింగ్ వర్కర్స్ అందరికీ చట్ట ప్రకారంగా రావలసిన సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం లేబర్ కార్యాలయం సీనియర్ సహాయకులు ఈ.లక్ష్మీప్రసన్నకు వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణ సంఘం గౌరవాధ్యక్షులు పుట్టా శంకరయ్య, కార్యదర్శి ఎస్.డి.రఫీ, కమిటి సభ్యులు మధు, రాజు, లక్ష్మయ్య, సుధాకర్, మునిరెడ్డి, ఎస్.డి.హాసిన్, శ్రీనివాసులు నాయకులు జోగి శివకుమార్, బి.వి.రమణయ్య, ఎంబేటి చంద్రయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాలను పరిరక్షించుకుందాం

### నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కమిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి పట్టణంలోని ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన ప్రభుత్వస్థలాలను కాపాడేందుకు జరుగుతున్న ఉద్యమానికి తన పూర్తి మద్దతు ఉంటుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. మంగళవారం వెంకటగిరిలోని ఎన్.జె.ఆర్ భవన్‌లో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు రామ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, పట్టణంలో ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ముఖ్యంగా జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానం, సమితి స్థలాలు తదితర ప్రజా ఆస్తులను కబ్జాల నుంచి రక్షించాల్సిన అవసరాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు ఉపయోగపడే ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవడం అత్యంత అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కమిటీ నాయకులు, విశ్రాంత ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.వి. రమణారెడ్డి, జి. కృష్ణారెడ్డి, ఎస్.వి. నరసింహులు, వి.వి. రమణయ్య తదితరులు పాల్గొన్నారు.






## నెల్‌క్యాస్ట్, రోటరీ వెస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో

# మెగా ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరం సందర్భంగా రక్తదానం చేస్తున్న నెల్‌క్యాస్ట్ ఉద్యోగులు

గూడూరు నెల్‌క్యాస్ట్ లిమిటెడ్ ఆవరణంలో నెల్‌క్యాస్ట్ లిమిటెడ్, రోటరీ క్లబ్ వెస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ ఉదయం ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. సుమారు 200 మంది నెల్‌క్యాస్ట్ ఉద్యోగులు శిబిరంలో పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా 30 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. వైద్య పరీక్షలు చేయించుకున్నవారికి అవసరమైన మందులను నెల్‌క్యాస్ట్ యాజమాన్యం ఉచితంగా పంపిణీ చేసింది. ఈ సందర్భంగా నెల్‌క్యాస్ట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (కార్పొరేట్) ఎన్.ఎస్.రెడ్డి, రోటరీ వెస్ట్ అధ్యక్షులు డి.విజయభాస్కర్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నెల్‌క్యాస్ట్ ఉద్యోగులకు నెల్లూరులోని బొల్లినేని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి(కిమ్స్) వారిచే ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. కిమ్స్ వైద్యులు ఎస్.శ్రీనివాసులు, వరుణ్ ప్రకాష్, జగదీష్, రేఖ, సత్యశ్రీ, మాధురి, కిమ్స్ పి.ఆర్.ఓ నవీన్ జయకుమార్, నెల్‌క్యాస్ట్ ప్లాంట్ హెడ్ ఎ.శ్రీనివాసరావు, యల్లసిరి గోపాల్‌రెడ్డి, కార్యదర్శి రాఘవరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, వాస్‌గౌడ్, నెల్‌క్యాస్ట్ పిఆర్ఓ ఆనిమెళ్ళ శివకుమార్, హెచ్ఆర్ఓలు పి.ప్రభు, ఎ.నరేష్, ఎన్.ఎస్.మూర్తి, శేషమూర్తి, నరేష్ పాల్గొన్నారు.






## గూడూరు లయన్స్‌కి నూతన ఛైర్మెన్లు



సత్కారాలందుకున్న లయన్స్ రీజియన్, జోనల్ ఛైర్మెన్‌లు

లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపీ, టౌన్, వెస్ట్ క్లబ్స్‌కి ఇటీవల ఛైర్మెన్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బెస్ట్ రీజియన్ ఛైర్మెన్‌గా కృష్ణమూర్తి ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఏ.పి సింగ్ చేతులమీదగా అవార్డు తీసుకోవడం జరిగింది. అలాగే 2026-27 సంవత్సరానికి రీజియన్ ఛైర్మెన్‌గా ఎన్నికైన డి.కె.ఆదిశేషారెడ్డి, జోన్ ఛైర్మెన్స్‌గా ఎన్నికైన వి.చంద్రశేఖర్‌రెడ్డి, యం.రూపేష్‌రెడ్డి, వి.శ్రీధర్‌లను సన్మానించారు. యస్.యస్.వి.రామ్మోహన్, ఆర్.వి.రావు, రూపేష్, లక్ష్మినారాయణ, సురేష్, అప్పారావు, హేమలత, లలిత తదితరులు పాల్గొన్నారు.

## కొండాగుంటలో 'బడిబాట'

గూడూరు మండల పరిధిలోని కొండాగుంట గ్రామంలో ఇటీవల అంగన్‌వాడి "బడిబాట" కార్యక్రమం నిర్వహించారు. ఏ.సి.డి.పి.ఓ శారదాంబ, సెక్టార్ సూపర్వైజర్ ఎన్.స్వరూపారాణి, అంగన్వాడీ కార్యకర్తలు ఈశ్వరమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

# సృజనశక్తి నుండి ఉపాధి వరకు.. కొత్త దారులు!

సృజనాత్మకత అనేది మనిషి లోపల దాగి ఉన్న అత్యంత విలువైన శక్తి. ఆలోచనలను రూపంలోకి మార్చే సామర్థ్యం, ఊహలను కార్యరూపంలో పెట్టే ధైర్యం, కొత్తదాన్ని సృష్టించే తపన..ఇవన్నీ కలిసినప్పుడు సృజనాత్మక వృత్తులు పుట్టుకొస్తాయి. నేటి యువతలోఈ శక్తిమరింతగాపెరుగుతోంది. "కల్పనకు కలం ఉంటే, భవిష్యత్తుకు వెలుగు ఉంటుంది" అనే మాట ఈ సందర్భంలో సరిగ్గా సరిపోతుంది. వాణిజ్య, విజ్ఞాన, వైద్య రంగాల్లాగే సృజనాత్మక రంగాలు కూడా నేటి ప్రపంచంలో సమాన ప్రాధాన్యం పొందుతున్నాయి. డిజైన్, సినిమా, రచన, గేమింగ్ వంటి రంగాలు యువతకు ఉపాధి మాత్రమే కాదు, వ్యక్తిత్వ వికాసానికి కూడా మార్గం చూపుతున్నాయి.

**డిజైన్ రంగంలోనూ సరికొత్త దారులు :**

డిజైన్ రంగం అనేది కేవలం చిత్రాలు గీయడం మాత్రమే కాదు. మనం ఉపయోగించే ప్రతి వస్తువు వెనుక ఒక డిజైన్ ఆలోచన ఉంటుంది. ఒక కుర్చీ ఆకారం నుంచి మొబైల్ ఫోన్ రూపం వరకు, ఒక పుస్తక ముఖచిత్రం నుంచి ఒక నగర నిర్మాణం వరకు అన్నింటికీ డిజైన్ అవసరం. ఉదాహరణకు, ఒక చిన్న స్టార్టప్ సంస్థ తమ ఉత్పత్తిని మార్కెట్లో ప్రత్యేకంగా చూపించాలంటే, మంచి డిజైన్ తప్పనిసరి. "రూపమే గుణానికి ప్రతిబింబం" అనే సూక్తి డిజైన్ రంగానికి అచ్చం సరిపోతుంది. నేటి యువత డిజిటల్ సాధనాలను నేర్చుకుని, తమ సృజనాత్మకతను ఉపయోగించి ప్రపంచవ్యాప్తంగా అవకాశాలను పొందగలరు. డిజైన్ రంగంలో గ్రాఫిక్ డిజైన్, ఉత్పత్తి డిజైన్, ఫ్యాషన్ డిజైన్, యూజర్ అనుభవ రూపకల్పన వంటి అనేక విభాగాలు ఉన్నాయి. ప్రతి విభాగం యువతకు కొత్త దారులు తెరుస్తోంది.

**సినిమా అంటే నటన మాత్రమే కాదు :**

సినిమా రంగం కూడా నేటి యువతను ఆకర్షించే ప్రధాన వృత్తి మార్గం. సినిమా అనేది కేవలం నటన మాత్రమే కాదు; కథ, కెమెరా, సంగీతం, ఎడిటింగ్, కళా రూపకల్పన, శబ్ద రూపకల్పన వంటి అనేక విభాగాల సమాహారం. ఒక చిన్న కథను పెద్ద తెరపై ప్రాణం పోసే ప్రక్రియలో ఎన్నో సృజనాత్మక దశలు ఉంటాయి. ఉదాహరణకు, ఒక యువ దర్శకుడు తన ఊరిలో జరిగిన చిన్న సంఘటనను కథగా మార్చి, దానికి సరైన దృశ్యరూపం ఇస్తే, అది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందే అవకాశం ఉంది. "కథ ఉన్న చోట కళ ఉంటుంది" అనే మాట ఈ రంగానికి సరిగ్గా సరిపోతుంది. నేటి కాలంలో చిన్న కెమెరా, సరళమైన సాంకేతిక సాధనాలతో కూడా యువత తమ ప్రతిభను ప్రపంచానికి చూపగలుగుతున్నారు.

రచన రంగం అనేది శాశ్వతమైనది. మాటలతో ప్రపంచాన్ని మార్చగల శక్తి రచయితకు ఉంటుంది. పుస్తకాలు, కథలు, వ్యాసాలు, సంభాషణలు, స్క్రిప్టులు..ఇవన్నీ రచనలో భాగం. ఒక మంచి రచయిత

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

సమాజాన్ని ఆలోచింపజేయగలడు, ప్రేరేపించగలడు, మార్పు తీసుకురాగలడు. ఉదాహరణకు, ఒక విద్యార్థి తన అనుభవాలను కథగా రాస్తే, అది మరొకరి జీవితానికి వెలుగు చూపవచ్చు. "వాక్కే వజ్రం" అనే సూక్తి రచన రంగానికి అద్భుతంగా సరిపోతుంది. నేటి ప్రపంచంలో డిజిటల్ వేదికలు పెరగడంతో రచయితలకు అవకాశాలు మరింత విస్తరించాయి. బ్లాగులు, కథా వేదికలు, డిజిటల్ పత్రికలు .. ఇవన్నీ కొత్త రచయితలకు వేదికలు.

**సృజనాత్మకతకు పెరుగుతున్న ఆదరణ :**

అదేవిధంగా, గేమింగ్ రంగం నేటి యువతలో అత్యంత వేగంగా ఎదుగుతున్న వృత్తి మార్గం. గేమ్ రూపకల్పన, కథా నిర్మాణం, పాత్రల రూపకల్పన, శబ్ద రూపకల్పన, యానిమేషన్.. ఇవన్నీ గేమింగ్ ప్రపంచంలో కీలకమైనవిభాగాలు. ఒక మంచి గేమ్ వెనుక ఉన్న సృజనాత్మకత, కథ, రూపకల్పన, సాంకేతికత..ఇవన్నీ కలిసి ఒక కొత్త అనుభవాన్ని సృష్టిస్తాయి. ఉదాహరణకు, ఒక చిన్న గ్రామంలో ఉన్న విద్యార్థి తన ఊరి కథను ఆధారంగా చేసుకుని ఒక గేమ్ రూపొందిస్తే, అది ప్రపంచవ్యాప్తంగా ఆడబడే అవకాశం ఉంది. "ఆలోచనకు ఆకాశమే హద్దు" అనే సూక్తి గేమింగ్ రంగానికి అచ్చం సరిపోతుంది. ఈ రంగంలో ఉన్న అవకాశాలు అపారమైనవి.సృజనాత్మక రంగాల్లో ఉపాధి అవకాశాలు ఎందుకు పెరుగుతున్నాయి అంటే, నేటి ప్రపంచం కథలను, రూపాలను, అనుభవాలను కోరుకుంటోంది. ప్రతి సంస్థకు మంచి డిజైన్ అవసరం. ప్రతి వేదికకు మంచి కథ అవసరం. ప్రతి వినియోగదారునికి మంచి అనుభవం అవసరం. అందుకే సృజనాత్మకతకు విలువ పెరుగుతోంది. "కళ ఉన్న చోట కల ఉంటుంది, కల ఉన్న చోట భవిష్యత్తు ఉంటుంది" అనే మాట ఈ సందర్భంలో మరింత సార్థకం. యువత తమ ఆసక్తిని, ఊహాశక్తిని, కృషిని కలిపితే, ఈ రంగాల్లో అద్భుతమైన భవిష్యత్తు నిర్మించుకోవచ్చు. సృజనాత్మక వృత్తులు కేవలం ఉపాధి మాత్రమే కాదు, వ్యక్తిత్వ వికాసానికి కూడా మార్గం చూపుతాయి. ఒక డిజైనర్ ప్రపంచాన్ని కొత్త కోణంలో చూస్తాడు. ఒక రచయిత మనసులను చదువుతాడు. ఒక దర్శకుడు భావాలను దృశ్యరూపంలో చూపుతాడు. ఒక గేమ్ రూపకర్త అనుభవాలను సృష్టిస్తాడు. ఈ రంగాల్లో పనిచేసే వ్యక్తులు తమలోని సృజనాత్మకతను పెంపొందించుకుంటారు. 'తనను తెలుసుకున్నవాడే ప్రపంచాన్ని మార్చగలడు' అనే సూక్తి ఈ రంగాలకు అద్భుతంగా సరిపోతుంది.మొత్తానికి, సృజన శక్తి నుంచి ఉపాధి వరకు ఉన్న ఈ ప్రయాణం యువతకు కొత్త అవకాశాలను తెరుస్తోంది. డిజైన్, సినిమా, రచన, గేమింగ్ వంటి రంగాలు నేటి ప్రపంచంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న వృత్తి మార్గాలు. తమ ఆసక్తిని, కృషిని, సృజనాత్మకతను కలిపి ముందుకు సాగితే, యువతకు ఈ రంగాల్లో అపారమైన భవిష్యత్తు ఉంది. "కృషి చేసినవాడికి ముందుకు వెళ్లే మార్గం తానే తెరుచుకుంటుంది" అనే సామెతను గుర్తుంచుకుంటే, సృజనాత్మక రంగాల్లో యువత భవిష్యత్తు మరింత ప్రకాశవంతంగా ఉంటుంది.



**వచ్చే వారం:** ప్రభుత్వ ఉద్యోగం: వాస్తవం ఏది, వదంతి ఏది?

E-mail: reddyu@gmail.com

# ఒత్తిడిని జయించే దివ్యౌషధం..యోగా

● కలెక్టర్ హిమాన్షు శుక్ల

ఆరోగ్యవంతమైన జీవనశైలికి యోగ ఉత్తమ మార్గమని, ఒత్తిడిని జయించే దివ్య ఔషధం యోగాయేనని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చెప్పారు. జూన్ 21న జరుగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 12న నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఏర్పాటుచేసిన సామూహిక యోగా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నేటి ఉరుకుల పరుగుల జీవితంలో పెరుగుతున్న ఆందోళనలను అధిగమించి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న డయాబెటిస్, రక్తపోటు, ఊబకాయం వంటి



జీవనశైలి వ్యాధులను నియంత్రించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. యోగాను ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి చేరువ చేయాలనే లక్ష్యంతో జిల్లావ్యాప్తంగా యోగాంధ్ర-2026 కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వివిధ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, రెసిడెన్షియల్ అసోసియేషన్ల సహకారంతో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో యోగా పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. తొలుత, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, నగర మేయర్ సుజాతతో కలిసి కలెక్టర్ ఈ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం యోగా గురువు సలీనా పర్యవేక్షణలో అధికారులు, ప్రజలు యోగాసనాలు ఆచరించారు. ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాసరాజు, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ మాధురి, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎస్.కె.హజర్ అలీ, డీఎస్డీఓ జసీమ్, యోగా సాధకులు పాల్గొన్నారు.

# పోలీసులకు చిక్కిన.. 'ముురుగుడు చికెన్'

## ➤ ఒకే రోజున మూడు వాహనాల పట్టివేత



ఎవరెంత మొత్తుకుంటున్నా.. 'తగ్గేదే లే' అంటూ జిల్లాలో చికెన్ వ్యర్థాల వాహనాల జోరు పెరుగుతూనే ఉంది. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి అక్రమ వ్యాపారులు అత్యంత చౌకగా దొరికే ముురిగిపోయి.. పురుగులు పట్టి ఉన్న చికెన్‌వ్యర్థాలను దొంగ దారుల్లో జిల్లాలోకి తెచ్చేస్తున్నారు. చేపలగుంటల్లో మేతగా వేయడానికి అత్యల్ప ధరకి వాహనాల ద్వారా వాటిని ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువస్తున్నారు. వారి ధన దాహానికి ప్రజారోగ్యాన్ని పణంగాపెడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, పోలీసులు ఎంత గట్టిగా హెచ్చరిస్తున్నా చేపలగుంటల యజమానుల్లోగానీ, వాటి అక్రమ రవాణాదారుల్లో కానీ ఎలాంటి మార్పు ఉండడం లేదు. దీంతో, ఆ ముురుగుడు వ్యర్థాలను అరికట్టేందుకు పోలీసులు దృష్టి సారించారు. జాతీయ రహదారుల్లోనూ, ఇతరత్రా రోడ్లపై వాహన తనిఖీలను ముమ్మరం చేసి, మరింత గట్టి చర్యలకు ఉపక్రమించారు. ఈ నేపథ్యంలో ఈనెల 15న అనంతసాగరం మండలంలో ఓ వాహనాన్ని పోలీసులు తనిఖీ చేసి, అందులో డ్రమ్ముల్లో ఉన్న చికెన్‌వ్యర్థాలను బయటకు తీయించి నిర్వీర్యం చేశారు. రెవిన్యూ సిబ్బంది సమక్షంలో అనంతసాగరం డంపింగ్‌యార్డు వద్ద గుంతలు తీసి ఆ వ్యర్థాలన్నిటినీ పూడ్చిపెట్టారు. అదేవిధంగా, అదేరోజున సంగంలో ముంబై రహదారిపై వెళ్తున్న ఓ చికెన్ వ్యర్థాల వాహనాన్ని సంగం పోలీసులు పట్టుకున్నారు. అందులో భారీస్థాయిలో.. 71 డ్రమ్ముల్లో గబ్బుకొడుతున్న చికెన్‌వ్యర్థాలను పోలీసులు వెలికితీసి, అక్కడే కొండ దిగువన ఉన్న ప్రాంతంలో గుంతలు తీసి పూడ్చివేశారు. ఆ వ్యర్థాల వాహనాన్ని స్వాధీనం చేసుకుని, యజమానిపై కేసు నమోదు చేశారు.

**కొడవలూరు మండలంలో :**

కొడవలూరు మండలం తలమంచి సమీపంలోని కూనంపాడు గ్రామం వద్ద బెంగుళూరు నుంచి పనికిరాని కోళ్ల వ్యర్థాలను డ్రమ్ముల్లో వేసుకుని, చేపలగుంటల్లో వేసేందుకు తీసుకువెళ్తున్న ఓ వాహనాన్ని ఈనెల 15న కొడవలూరు పోలీసులు స్వాధీనం చేసుకుని, వాహన యజమానిపై కేసు నమోదు చేశారు.

# బాలూ గానం..అజరామరం!



ప్రముఖ సినీ సంగీత దర్శకుడు వీణాపాణిని సన్మానిస్తున్న శుభలేఖ సుధాకర్ తదితరులు

గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం (బాలూ) గానం గంధర్వగానమని, అది అజరామరమని వక్తలు కొనియాడారు. బాలూ 80వ జయంతిని పురస్కరించుకుని ఇటీవల నెల్లూరు టౌన్‌హాలులో 'చేతన' ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బాలూ నటించిన 'మిథునం' చిత్ర సంగీత దర్శకుడు స్వర వీణాపాణి ఎన్‌వివిఎన్ రమణమూర్తికి బాలూ అవార్డును, 'సంగీత స్వరప్రవీణ' బిరుదును ఇచ్చి సన్మానించారు. సినీనటుడు శుభలేఖ సుధాకర్, ఎస్పీ శైలజ ముఖ్య అతిథులుగా పాల్గొని వీణాపాణిని సత్కరించారు. తొలుత బాలూ చిత్రపటానికి నివాళులర్పించారు. కిన్నెర ఆర్ట్స్ కార్యదర్శి మద్దాళి రఘురాం, సినీ రచయిత పి.రాజేంద్రకుమార్, వీరిశెట్టి హజరత్‌బాబు, నలుబోలు బలరామయ్యనాయుడు, లియో ఆనంద్ తదితరులు పాల్గొనగా, చేతన నిర్వాహకులు శేషగిరీశం, డా. ఎం.సుబ్రహ్మణ్యం సభను నిర్వహించారు.

జొన్నవాడ కామాక్షితాయికి..

# వెండి నందిసేవ




బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 13న పెద్ద వెండినంది వాహనోత్సవం వైభవంగా జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిఅమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు పర్యవేక్షించారు.

# పెంచలకోన నిత్యాన్నదానానికి..2 లక్షల విరాళం

రాపూరు మండలం పెంచలకోనలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదాన పథకానికి కడప జిల్లాకి చెందిన దాతలు కల్లూరు శివ-చంద్రకళ దంపతులు ఈనెల 13న రెండు లక్షల 232 రూపాయలను విరాళంగా అందజేశారు. ఆలయ ఉప కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డికి ఆ విరాళాన్ని అందించారు. ఆలయ అర్చకులు దాతలకు దైవదర్శనం చేయించి, ఆశీస్సులందజేశారు.

# కళ్యాణ వైభవం...!




ఆరంబాకం వేణుగోపాల్ - ఉషల కుమారుడు (ప్రముఖ చిత్రకారుడు కీ॥శే॥ ఆరంబాకం రాజసింహ మనుమడు) **అన్వేష్ - స్వాతి** (కె.వి.శ్రీనివాసన్ - లతల కుమార్తె)ల వివాహ రిసెప్షన్ జూన్ 15వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనెలు.

# కావలి..కనకపట్నం కాబోతోంది!

## ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

'కావలి కనకపట్నం అవుతుందనే' మాట ఎంతోకాలం నుంచి మనకు వినపడుతూనే ఉంది. అయితే, అది ఇప్పుడిప్పుడే సాకారానికి వస్తోంది. కావలి పారిశ్రామికంగా బాగా అభివృద్ధి చెందుతుందని, భవిష్యత్తులో కావలి కనకపట్నం కాబోతోందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 17న కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డితో కలసి ఆయన కావలిలో కోట్లాది రూపాయలు వ్యయమయ్యే అభివృద్ధి పనులను ప్రారంభించారు. కావలి పట్టణంలోని పోలేరమ్మ అరుగు వద్ద నుండి కృష్ణుని బొమ్మ సెంటర్ వరకు ఎంపీల్యాడ్స్ నిధులు రూ.45 లక్షలతో మంజూరైన సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని కూడా ప్రారంభించారు. బాలకృష్ణారెడ్డి నగర్‌లో రూ.30లక్షలతో మంజూరైన సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని, పట్టణంలోని ఉదయగిరి రోడ్డు నుండి ఐడీఎస్ఎంటి లేఔట్ వరకు ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా కోటి రూపాయల నిధులతో మంజూరైన సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ప్రారంభోత్సవం చేశారు. కావలి పట్టణంలోని పెద్ద పవని రోడ్డు నుండి వెంకటేశ్వర థియేటర్ వరకు ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రూ.1.30కోట్ల రూపాయల నిధులతో మంజూరైన రోడ్డు విస్తరణ, వరవ కాలువపై శ్లాబులు ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి కష్టపడి పనిచేసే నైజం కలిగిన విజనరీ నాయకులైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ, ఐటీ శాఖ మంత్రి లోకేష్‌బాబు ఉండడం మనందరి అదృష్టం అన్నారు. కావలిలో మూడుకోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమన్నారు.



అభివృద్ధి పనులకి ప్రారంభోత్సవం చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

### త్వరలోనే బీపీఎల్ పరిశ్రమ ప్రారంభం :

మరో కొద్దినెలల్లో కావలి నియోజకవర్గంలో బీపీసీఎల్ పరిశ్రమ ప్రారంభం కాబోతోందని ఎంపీ వేమిరెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. రూ.90 లక్షల కోట్ల భారీ పెట్టుబడులతో వివిధ రూపాలలో బీపీసీఎల్ పరిశ్రమ ప్రారంభం కావడం నియోజకవర్గ ప్రజలకు శుభపరిణామమని అన్నారు. బీపీసీఎల్ పరిశ్రమకు తోడ్పాటుగా పలు పరిశ్రమలు స్థాపిస్తారన్నారు. నియోజకవర్గ ప్రజలకి ఏదో ఒక రూపంలో ఉపాధి ఉద్యోగ, వ్యాపార అవకాశాలు లభించడం ఖాయమన్నారు. అలాగే జువ్వలదిన్నె ప్రాంతంలో మరో పరిశ్రమ ప్రారంభం కాబోతోందని, అందులో కూడా 800 మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశాలుంటాయన్నారు. దగదర్తిలో విమానాశ్రయ నిర్మాణం సంబంధించి టెండర్లు కూడా పిలిచారన్నారు. తద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. బిట్రగుంట రైల్వే జంక్షన్ ప్రాంతాన్ని కూడా అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. బిట్రగుంటలో దాదాపు 700 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఆ ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్కు, మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కావలి చుట్టూ రామాయపట్నం బీపీసీఎల్, విమానాశ్రయం, జువ్వలదిన్నె తదితర ప్రాంతాలు ఉండడంతో కావలి నియోజకవర్గ అభివృద్ధికి తిరుగులేదని ఆయన వివరించారు.

## కష్ట నష్టాల సేద్యం..

# ఖర్చులకే నైవేద్యం!

## నిమ్మ రైతుల ఆవేదన



దేశంలో మంచి నిమ్మకాయల ఉత్పత్తికి పేరు మోసిన గూడూరు ప్రాంతంలోని నిమ్మ రైతులు ఇప్పుడు ఆవేదనలో ఉన్నారు. ఈ సీజన్‌లో బాగా ఉండాల్సిన నిమ్మకాయల ధరలు తగ్గిపోతుండడంతో రైతులు దిక్కుతోచనిస్థితిలో పడ్డారు. జిల్లాలో సుమారు 30వేల ఎకరాల్లో నిమ్మ సాగువుతోంది. గూడూరు, పొదలకూరు, వెంకటగిరి, రాపూరు, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో నిమ్మతోటలు అధికంగా ఉన్నాయి. నాణ్యమైన కాయలకు ప్రసిద్ధిచెందినది కావడంతో, గూడూరు నిమ్మకు దేశవ్యాప్తంగా మంచిపేరు ఉంది. అయితే క్రమేణా ఇతర ప్రాంతాల్లోని నిమ్మకాయలు ఢిల్లీ తదితర ప్రాంతాలకు భారీగా వెళ్తుండడంతో ఇక్కడి నిమ్మకాయలకి గతంలో ఉన్నంత గిరాకీ ఉండడం లేదు. అందులోనూ వాతావరణ మార్పులతో నిమ్మధరలు మరింత తగ్గిపోతుండడం నిమ్మ రైతులకు కంటనీరు తెప్పిస్తున్నాయి. ఈ వారంలో నిమ్మధరలు బాగా తగ్గిపోయాయని, సేద్యం ఖర్చులు, రవాణా ఖర్చులు కూడా చేతికి రావడం లేదని రైతులు వాపోతున్నారు.

### కిలో నిమ్మకాయలు 30 రూపాయలే

గూడూరు మార్కెట్‌లో నిమ్మధరలు గత కొద్దిరోజులుగా బాగా తగ్గిపోయాయి. బుధవారం నాటికి కిలో నిమ్మకాయల ధర 30 రూపాయలకి పడిపోయింది. 50 కేజీలుండే నిమ్మకాయల బస్తా కేవలం 1500 రూపాయలే పలుకుతోంది. దీంతో కోత ఖర్చులు కూడా గిట్టుబాటు కావడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు. ఏప్రిల్‌లో ఏ-గ్రేడ్ నిమ్మకాయల ధర కిలో 200 రూపాయలు పలకడంతో ఆనందం చెందిన రైతులు, ఇప్పుడు ఉన్నట్లుండి ధరలు పాతాళానికి పడిపోవడంతో ఆవేదనలో ఉన్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో, వర్షాలు మరింత ఉధృతమైతే పరిస్థితి ఇంకెంత దుర్భరంగా ఉంటుందోనని నిమ్మరైతులు డీలా పడిపోతున్నారు.

# గూడూరు జిల్లా కావాలంటూ హోమం

గూడూరు పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద భారత్ వికాస్ పరిషత్ సౌత్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కంకణాల పెంచలనాయుడు ఆధ్వర్యంలో గూడూరు జిల్లా కేంద్రం చేయాలని జరుగుతున్న శిబిరం 200వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రజల ఆకాంక్ష నెరవేరాలని హోమ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పెంచలనాయుడు మాట్లాడుతూ గూడూరు జిల్లా కేంద్రం అవడానికి అన్ని వనరులు ఉన్నాయని, భవిష్యత్ తరాలు ఎంతో అభివృద్ధి చెందుతాయని.. ప్రభుత్వం వెంటనే గూడూరును జిల్లా కేంద్రం చేయాలని కోరారు.



హోమం నిర్వహిస్తున్న కంకణాల పెంచలనాయుడు

## 'కళాంజలి' అనంత్‌కి..

# అవార్డుల పరంపర!

## 'అమ్మంటే'..'నాన్న' షార్ట్‌ఫిల్మ్‌లకి మళ్ళీ బహుమతులు




నెల్లూరులోని 'కళాంజలి' సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకుడు, ప్రముఖ దర్శకుడు-నటుడు-రచయిత కళాంజలి అనంత్ రూపొందించిన పలు షార్ట్ ఫిల్మ్‌లకు మళ్ళీ అవార్డులు వచ్చాయి. తాజాగా తెలంగాణలోని మంచిర్యాలలో ఇటీవల ఏర్పాటుచేసిన 'శ్రీనిహా బ్యూటీ అండ్ మేకప్ షార్ట్‌ఫిల్మ్‌ల పోటీ-2026'లో అనంత్ నిర్మించిన 'అమ్మంటే..', 'నాన్న' షార్ట్‌ఫిల్మ్‌లకి అవార్డులు లభించాయి. ఈ పోటీకి మొత్తం 46 షార్ట్‌ఫిల్మ్‌లు రాగా, అందులో 'బెస్ట్ పర్‌ఫార్మన్స్' బహుమతిని 'అమ్మంటే..' షార్ట్‌ఫిల్మ్‌లో అద్భుతంగా నటించిన శిరీషకి లభించింది. అదేవిధంగా, అదే షార్ట్‌ఫిల్మ్‌లో సహాయ నటునిగా నటించిన ప్రముఖ నటుడు బెనర్జీకి 'బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్' బహుమతి వచ్చింది. అనంత్ దర్శకత్వంలో నిర్మించిన మరో షార్ట్‌ఫిల్మ్ 'నాన్న'లో.. నాన్నగా అద్వితీయంగా నటించిన మునిచంద్ర 'ఉత్తమ నటుని'గా అవార్డు సాధించారు. 'నాన్న'లో ఉత్తమ దర్శకత్వానికి బెస్ట్ డైరెక్షన్ (జ్యూరీ) అవార్డు కళాంజలి అనంత్‌కి లభించింది. ఇప్పటివరకు అనంత్ రూపొందించిన షార్ట్‌ఫిల్మ్‌లకు రాష్ట్రస్థాయిలో ఉభయ తెలుగు రాష్ట్రాలు, జాతీయస్థాయిలోనూ అవార్డుల పంట పండుతోంది. అనంత్ నిర్మాణం..దర్శకత్వంలోని 'పండుటాకులు' షార్ట్‌ఫిల్మ్‌కి ఇప్పటివరకు 12 అవార్డులు రావడం ఒక విశేషమైతే, 'షీ' షార్ట్ ఫిల్మ్‌కి 4అవార్డులు, 'అమ్మంటే'కి 5, 'నాన్న'కి 5, ఇటీవలే రూపొందించిన 'చెట్టు=తల్లి'కి 3 అవార్డులు లభించడం మరో విశేషం. మొత్తంగా ఈ షార్ట్‌ఫిల్మ్‌లకు 29 అవార్డులు రావడం అనంత్ దర్శకత్వ ప్రతిభకి నిదర్శనం. షార్ట్‌ఫిల్మ్‌ల రూపకల్పనలో తనదంటూ ప్రత్యేకతతో రాణిస్తూ, సమాజానికి ఉపయోగకరమైన మంచి ఆలోచనాత్మకమైన సందేశాలనిస్తూ.. నెల్లూరుసీమ ఖ్యాతిని దశదిశలా చాటుతున్నాడు కళాంజలి అనంత్.



శిరీష



బెనర్జీ



మునిచంద్ర

# ఎండ - వాన...!

అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న నెల్లూరు నగర వాసులకి గురువారం కొంత ఊరట లభించింది. బుధవారం సాయంత్రం నుండి ఉరుములు, మెరుపులతో ఆకాశం గర్జించింది. గురువారం తెల్లవారుఝామున మంచి జల్లు కురిసింది. ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలు మన రాష్ట్రంలోకి ఆలస్యంగా వస్తాయని వాతావరణ నిపుణులు ఓ వైపు హెచ్చరిస్తున్నారు. ఎండలు కూడా అంతే స్థాయిలో మండుతూ ప్రజలని భయపెడుతున్నాయి. బుధవారం సైతం ఇటు ఆంధ్రాలోనూ, అటు తెలంగాణలోనూ 42 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. గురువారం ఉదయం కురిసిన వర్షం జనానికి కొంత ఉపశమనం కలిగించిందనే చెప్పొచ్చు. రానున్న రెండుమూడు రోజులలో రాష్ట్రంలో మరికొన్ని చోట్ల కూడా ఉరుములు మెరుపులతో కూడిన జల్లులు పడతాయని వాతావరణ నిపుణులు చెప్తున్నారు. కృష్ణపట్నంలో వున్న పవర్ ప్లాంట్ల ప్రభావంతో నెల్లూరు నగరంలో వానలే పడడం లేదని జనం వాపోతున్నారు. చూడాలి మరి.. ఈ ఏడాది ఎలా ఉండబోతోందో...!

# ప్రభుత్వ ఉద్యోగులపై దాడి..దారుణం

- పశుసంవర్ధక అధికారుల ఆందోళన



ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం మెగులూరు గ్రామంలో ఓ రైతు, ఆ గ్రామ పశువైద్యశాలలో పనిచేస్తున్న సహాయ శస్త్ర వైద్యునిపై దాడి చేయడం దారుణమంటూ ఈనెల 17న నెల్లూరులో పశుసంవర్ధకశాఖ అధికారులు ఆందోళన చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులపై దాడిచేయడం ఘోరమని ఆ శాఖ జేడీ రమేష్‌నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలేమైనా ఉంటే చట్టబద్ధమైన మార్గాల్లో తెలియజేయాలే తప్ప దాడులు చేయడం సముచితం కాదన్నారు. ఉద్యోగులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని ఆయన కోరారు. పశుసంవర్ధకశాఖ డీడీ సోమయ్య, ఏ.డీలు మాలకొండయ్య, కృష్ణమూర్తి, మాధవీలత, యశోద, సహాయ శస్త్రవైద్యులు వెంకటేశ్వర్లు, జయపాల్‌రెడ్డి, కృష్ణమోహన్, జయప్రకాష్ పాల్గొన్నారు.

# మునిసిపల్ కార్మికుల నిరసన




నిరసన ప్రదర్శన చేస్తున్న మునిసిపల్ కార్మికులు

మునిసిపల్ రంగంలో ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఆపాలని, మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవాలంటూ ఈనెల 17న మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో నెల్లూరులో ఆందోళన చేపట్టారు. ఏళ్లతరబడి పనిచేస్తూనే ఉన్నా తమను రెగ్యులర్ చేయకపోవడం అన్యాయమని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా మునిసిపల్ రంగంలోని 14 కీలక విభాగాలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టాలని ప్రయత్నించడం దారుణమని విమర్శించారు. కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయు జిల్లా అధ్యక్షుడు పెంచలనరసయ్య, రూరల్ కార్యదర్శి దేశమూర్తి పాల్గొన్నారు. తొలుత, నగరంలోని బీవీనగర్ నుంచి కొండాయపాళెం గేటు వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు.

# ప్రైవేటు స్కూళ్ల..ఫీజుల దోపిడీ

- అరికట్టాలంటూ ఎస్ఎఫ్ఐ వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యను వ్యాపారమయం చేస్తూ అనేక ప్రైవేటు స్కూళ్ళు, కార్పొరేట్ విద్యాసంస్థల వారు వివిధ రకాల ఫీజుల పేరుతో దోచుకుంటున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రవీణ్, అమర్ తదితరులు ఆరోపించారు. ఆమేరకు నెల్లూరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏ.డి గ్లోరీకుమారికి వినతిపత్రం అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల ప్రాంగణంలోనే యూనిఫామ్, బ్యాగులు, పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నారని వారు పేర్కొన్నారు.

## కావలి సహకార బ్యాంక్‌లో.. కారుణ్య నియామకం

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు-కావలి శాఖలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తూ గుండెపోటుతో మరణించిన ఇందుపూరి రాజేష్ స్థానంలో, ఆయన కుమారుడు ఇందుపూరి తేజకి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇచ్చారు. ఈనెల 17న బ్యాంక్ ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఆయనకి ఉద్యోగ నియామక పత్రం అందజేశారు.

# టీనేజ్ ప్రెగ్నెన్సీ నివారణపై అవగాహన పెంచాలి




పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో అనూష తదితర అధికారులు

టీనేజ్ ప్రెగ్నెన్సీ నివారణ అంశంపై అవగాహన పెంపొందించాలని నెల్లూరు ఆర్డీఓ అనూష చెప్పారు. ఈనెల 17న మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు సూపర్‌వైజర్లకు ఆర్డీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్డీవో అనూష మాట్లాడుతూ, జిల్లాలో టీనేజ్ ప్రెగ్నెన్సీ కేసులను తగ్గించేందుకు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలు, స్లమ్ ప్రాంతాలలో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలకు టీనేజ్ ప్రెగ్నెన్సీ వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక మరియు విద్యాపరమైన దుష్పరిణామాలను వివరించాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులను కూడా ఈ కార్యక్రమాలలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.సురేష్, ఎస్ఐ అనిల్‌రెడ్డి మాట్లాడుతూ బాలల రక్షణకు, సంరక్షణకు సంబంధించిన చట్టాలను విశదీకరించారు. డిప్యూటీ ఎంపీడీవో పద్మజ టీనేజ్ ప్రెగ్నెన్సీ నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. డిప్యూటీ తహశీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో పద్మజ, ఏహెచ్‌టీయు ఏఎస్ఐ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ నేత్రజ్యోతికి విశేష స్పందన



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న నారాయణ ఆసుపత్రి వైద్యులు

'ఆరోగ్య నెల్లూరు' లక్ష్యంగా రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ చేపట్టిన నారాయణ నేత్రజ్యోతి, నారాయణ దంత సురక్ష ఉచిత వైద్య శిబిరాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈనెల 17న నెల్లూరు నగరంలోని గుప్తా పార్కు సెంటర్‌లో నారాయణ ఆసుపత్రి వారు వైద్యశిబిరాలు ఏర్పాటుచేయగా ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఆరోగ్యపరీక్షలు చేయించుకున్నారు. రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ శిబిరాలు ఏర్పాటయ్యాయి. వైద్యులు కంటిపరీక్షలు చేసి ఉచితంగా కంటి అద్దాలు ఇస్తున్నారు. అవసరమైనవారికి శస్త్రచికిత్సలు కూడా చేయిస్తున్నారు.

# 'యోగా' విజేతలకు బహుమతులు




అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14, 15, 16తేదీల్లో యోగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. యోగాకి సంబంధించిన వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన విజేతలను నగర మేయర్ దేవరకొండ సుజాత, కమిషనర్ వైఓ నందన్, డెప్యూటి డైరెక్టర్ మాధురి, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ దినేష్, ఆయుష్ వైద్యురాలు శారద హెప్సీబాలు అభినందించి సన్మానించారు. పోటీల న్యాయనిర్ణేతలు రాజేంద్ర, ప్రసన్న కుమార్, స్వప్న, యోగా పరిశీలకులు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# మూడు ఆలయాల్లో చోరీలు

వరికుంటపాడు మండలంలోని బోయమడుగుల పంచాయతీలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు మూడు ఆలయాల్లో చోరీలకు పాల్పడ్డారు. తూర్పు బోయమడుగులలోని గ్రామదేవత నాగరపమ్మ ఆలయం తలుపులు పగులగొట్టి అమ్మవారి మెడలో ఉన్న బంగారు వస్తువులతో పాటు, హుండీని ఎత్తుకెళ్ళారు. మరో నాగరపమ్మ దేవాలయంలోనూ జొరబడి అమ్మవారి తాళిబొట్టు, వెండిపడగ, వెండి పూజాసామగ్రిని, హుండీని అపహరించారు. అలివేలుమంగాపురంలోని రామాలయంలో కూడా హుండీని అపహరించి గ్రామ శివారుల్లో పడేశారు. ఎస్ఐ మధుసూదన్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## టూకీగా...



### కలిగిరమ్మ తిరునాళ్ళప్రారంభం

మండల కేంద్రమైన కలిగిరి గ్రామదేవత కలిగిరమ్మ అమ్మవారి తిరునాళ్ళ ఈనెల 18న వైభవంగా ప్రారంభమైంది. కలిగిరి పాత ఊరులో వెలసివున్న అమ్మవారి తిరునాళ్ళలో భాగంగా అన్నదాన వితరణతో పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా జరుగనున్నాయి. గ్రామస్తుల ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ వరకు ఈ తిరునాళ్ళ సందడిగా సాగుతుంది.

### కావలిలో 'సంయుక్త' సేవాసంస్థ వితరణ

కావలి తుఫాన్‌నగర్‌లోని సంయుక్త సేవాసంస్థ వారు దత్తత తీసుకున్న నిరుపేద కుటుంబాలకు ఈనెల 17న బియ్యం, కూరగయాలు తదితర నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సంస్థ సంరక్షణలో ఉన్న దుర్గాపావనికి సైకిల్‌ను బహుకరించారు. సంస్థ వ్యవస్థాపకురాలు..నాట్య గురువు లిఖిత, అధ్యక్షులు సురేంద్ర, ఆర్షియా తదితరులు పాల్గొన్నారు.

### ఉదయగిరిలో దివ్యాంగులకు ఉపకరణాలు

జిల్లావిద్యాశాఖ-సమగ్రశిక్ష విభాగం తరపున ఉదయగిరి మండలంలోని 9 మంది విద్యార్థులకు అవసరమైన 18 రకాల ఉపకరణాల కిట్‌లను అందజేశారు. మానసికంగా ఎదుగుదల లేని పిల్లలకు టీఎల్ఎం కిట్‌లు ఇచ్చారు. అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య, సహిత విద్య సమన్వయకర్త ప్రసాద్ రావు, సుభాష్‌చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

### అల్లూరుకు కొత్త తహశీల్దారుగా నవీన్‌కుమార్

అల్లూరు మండల కొత్త తహశీల్దారుగా ఏ. నవీన్‌కుమార్ ఈనెల 17న బాధ్యతలు స్వీకరించారు. మండల అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మండల అభివృద్ధికి శక్తిమేరా కృషి చేస్తానని ఈ సందర్భంగా నవీన్ చెప్పారు.

### ఓబులాయపల్లిలో రైతులతో సమావేశం

రాపూరు మండలం ఓబులాయపల్లిలో ఈనెల 17న పొదలకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు శివనాయక్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన శిబిరం నిర్వహించారు. పంటపొలాల్లో భూసారం పెరగడానికి తగు సూచనలిచ్చారు. పొదలకూరు వ్యవసాయపరిశోధన స్థానం శాస్త్రవేత్త సురేఖ, ఉద్యానశాఖ అధికారిణి సాయిలక్ష్మి, సోమసుందర్ పాల్గొన్నారు.

### యాచవరంలో ప్రసన్నాంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ

మనుబోలు మండలం యాచవరం గ్రామంలో ఈనెల 17న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. అర్చకులు మనోజ్‌కుమార్ శర్మ (నాని) ఆధ్వర్యంలో స్వామివారికి కుంభాభిషేకం, ప్రత్యేకపూజలు జరిగాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

### కొండపాళెం పాఠశాల తనిఖీ

ఉదయగిరి మండల పరిధిలోని కొండపాళెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఈనెల 17న మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి, బోధన తీరును ఆరా తీశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ప్రధానోపాధ్యాయుడు షేక్ హుస్సేన్‌బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### దగదర్తిలో వాహనదారులకు క్లాస్‌పీకిన ఎస్ఐ


లైసెన్సు లేకుండా వాహనం నడపడం, మద్యం తాగి వాహనాలు నడపడం వంటివి చట్టరీత్యా నేరమని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని దగదర్తి ఎస్ఐ మహేంద్ర ఈనెల 17న దగదర్తిలోని వాహనదారులకు క్లాస్‌పీకారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లితండ్రులను హెచ్చరించారు. ఒకవేళ ఇస్తే వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందన్నారు.

### చెన్నూరులో డయేరియాపై అవగాహన

గూడూరు మండలం చెన్నూరులో ఈనెల 15 నుంచి జులై 31వతేదీ వరకు డయేరియా వ్యాధిపై అవగాహన కలిగిస్తున్నారు. చిన్నపిల్లల్లో వ్యాధినిరోధక శక్తి తక్కువ కనుక వారికి ఎక్కువగా ఈ వ్యాధి వస్తుంటుందని, వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏంపీహెచ్‌ఎస్ మస్తానయ్య వివరిస్తున్నారు. ఎంపీహెచ్‌ఓ వరప్రసాద్, ఏఎన్ఎం దయామణి పాల్గొన్నారు.

# ధనాశతోనే.. 'సిజేరియన్లు'

## • కోత లేకుండా కాన్పు కష్టమేనని మభ్యపెడుతున్న ప్రైవేటు వైద్యులు
## • అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు



***వైద్యో నారాయణో హరి' అన్నారు పెద్దలు, కానీ ఇప్పట్లో అనేకమంది వైద్యులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఆసుపత్రులు పెట్టుకుని, వాటి నిర్వహణ కోసమంటూ రోగుల వద్ద వేలకు వేలు ఫీజులు గుంజుకోవడమే ధ్యేయంగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో చివరికి గర్భిణులను కూడా అనవసరపు శస్త్రచికిత్సల పేరుతో మాయచేసి డబ్బు దోచుకుంటున్నారు. ఇది ఏ ఒక్క రాష్ట్రంలోనో కాదు, దేశవ్యాప్తంగా ఇదే దుస్థితి. అదేపనిగా కొందరు ధనాశపరులైన ప్రైవేటు వైద్యులు దీనినే పెద్ద వ్యాపారంగా చేసుకుని కాసులు దండుకుంటున్నారని ఆరోగ్య నిపుణులు ఆందోళన చెందుతున్నారు.***

సిజేరియన్ అనేది మేజర్ సర్జరీ అంటారు వైద్య నిపుణులు. నిజంగానే ఇది ఒక పెద్ద శస్త్రచికిత్స. అత్యవసర పరిస్థితుల్లో అది ప్రాణాలను కాపాడినప్పటికీ, అనవసరంగా చేసే సిజేరియన్ ఆపరేషన్ల వల్ల పుట్టబోయే బిడ్డకు, కాలక్రమేణా అనేక ఆరోగ్య సమస్యలతో పాటు, రకరకాల ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశం కూడా ఉందని నిపుణులు చెప్తున్నారు. సిజేరియన్ల వల్ల, తల్లులకు కూడా పొత్తికడుపులో నొప్పి, గర్భాశయ సమస్యలు కూడా వస్తాయని, భవిష్యత్తులో అనేక ఇబ్బందులు కూడా ఎదురవుతాయని అంటున్నారు. సిజేరియన్‌ల ద్వారా పిల్లలను కన్న తల్లులకు, అలా పుట్టిన బిడ్డలకు కూడా ఈ సిజేరియన్ల వల్ల అనేక కష్టనష్టాలున్నా, ప్రైవేటు వైద్యశాలలోని వైద్యులు మాత్రం సిజేరియన్లే మంచిదని చెప్తూ, తమ పబ్బం గడుపుకుంటున్నారు. కొందరు గర్భిణులు కూడా, పురిటి నొప్పులు కష్టంగా ఉంటాయని, కనుక సిజేరియన్ చేయించుకోవడమే మంచిదని అంటుండడంతో, సరిగ్గా ఆ బలహీనతే వైద్యులకు కాసులు రాలుస్తోంది. తల్లికో, బిడ్డకో ప్రాణంమీదికి వచ్చినప్పుడే చేయాల్సిన సిజేరియన్ ఆపరేషన్‌ని, గర్భిణుల ఆరోగ్యం బాగున్నా సహజ ప్రసవం సులభంగా ఉంటున్నా వైద్యులు పట్టించుకోవడం లేదు. ధనార్జనే ధ్యేయంగా ఉండే వైద్యులు సిజేరియన్ తప్పనిసరైందని చెప్తూ.. చేసేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇటీవలికాలంలో ఈ సిజేరియన్లు బాగా పెరిగిపోతున్నాయి.

### రకరకాల కారణాలు :

జీవనశైలి వల్ల కలిగే మార్పులతో, గర్భిణుల్లో శారీరక శ్రమ తగ్గిపోతుండడం, చిన్న నొప్పులకే భయపడిపోతుండడం అలవాటైపోయింది. సిజేరియన్ చేయించుకుంటే ఈ బాధలుండవని, కాన్పు తేలిగ్గా అయిపోతుందని అనుకుంటున్నారు. కుటుంబ సభ్యులు కూడా వారిని సిజేరియన్ల వైపే ప్రోత్సహిస్తున్నారు. కొంతమంది బిడ్డలు పుట్టే సమయం బాగుండాలని, రాహుకాలంలో పుట్టకూడదని, మంచి ముహూర్తంలో పుట్టాలని అనుకుంటూ లేనిపోని మూఢనమ్మకాలతో తమ కాన్పు సమయాన్ని వారికి అనుకూలంగా మార్చుకుంటూ సిజేరియన్లు చేయించుకుంటున్నారని, దీంతో సాధారణ ప్రసవాలు తగ్గిపోతున్నాయని వైద్యనిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పెరుగుతున్న మరణాలు :

వైద్యుల నిర్లక్ష్యం, అనవసరమైన శస్త్రచికిత్సల వల్ల దేశవ్యాప్తంగా తల్లీబిడ్డల మరణాలు కూడా భారీగా పెరిగిపోతున్నాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. మనదేశంలో గత రెండు దశాబ్దాల్లో 8.5 శాతం నుంచి సుమారు 27శాతం వరకు సిజేరియన్ ప్రసవాలు పెరిగాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సాధారణ ప్రసవాలతో పోలిస్తే, సిజేరియన్ల ద్వారా కలిగే బాధలు, ఆ తర్వాత మరణాలు కూడా ఎక్కువగానే ఉంటున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కనుక, కాన్పు సమయంలో గర్భిణులు, వారి కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండి, తగు అవగాహనతో, నిపుణులైన వైద్యులతో మాత్రమే తమ ప్రసవ ప్రణాళికలు రూపొందిచుకోవాల్సి ఉందని వారు సూచిస్తున్నారు. అవసరం లేకున్నా, ఆపరేషనే మేలంటూ.. సిజేరియన్‌ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేసే వైద్యుల నుంచి దూరంగా ఉండాలని కూడా వారు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వాలు కూడా అప్రమత్తంగా ఉండి, ప్రైవేటు వైద్యులతీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. డబ్బు కోసం అనవసరంగా ఆపరేషన్లు చేసే వైద్యులను కట్టడిచేయాలని ప్రజలు కోరుతున్నారు. ఏదేమైనా, గర్భిణులు ప్రసవకాలంలో ఎల్లవేళలా జాగ్రత్తగా ఉంటూ, తమ ఆరోగ్యం కోసం ఏది మంచో ఆలోచించుకుని, కుటుంబసభ్యుల నిర్ణయాలను కూడా సమీక్షించుకుని తగు నిర్ణయాలు తీసుకోవడమే శ్రేయస్కరం!.. కనుక తస్మాత్..జాగ్రత్త!...

# దేశంలో పెరిగిపోతున్న ఆర్థిక అసమానతలు

## పరకాల ప్రభాకర్ విమర్శ



సదస్సులో మాట్లాడుతున్న పరకాల ప్రభాకర్

దేశంలో గతంలో ఎప్పుడూ లేనంతగా ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని ప్రముఖ ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 14న నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో, డాక్టర్ శేషారెడ్డి 18వ స్మారక సదస్సులో ఆయన మాట్లాడారు. 'వికసిత్ భారత్ భ్రమలు–వాస్తవాలు' అనే అంశంపై ఆయన ప్రసంగిస్తూ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కుట్రపూరితంగా చేస్తున్నారని ఆరోపించారు. అందువల్ల కోట్లాదిమంది ఓటు హక్కు కోల్పోతున్నారని ఆయన విమర్శించారు. ఈ పరిస్థితులు మారాలని అభ్యుదయవాదులందరూ ఆకాంక్షిస్తున్నారని ఆయన అన్నారు. ఈ సదస్సులో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత దేవరాజు మహారాజు మాట్లాడుతూ, ప్రస్తుత పాలకులు విశ్వవిద్యాలయాలను సైతం అంధకారంలోకి నెడుతున్నారని, మూఢ విశ్వాసాలను కూడా విద్యారంగంలోకి ప్రవేశపెడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ప్రజారోగ్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ ఎంవి రమణయ్య, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎంవి చలపతి, యూటిఎఫ్ నాయకులు, పలువురు అభ్యుదయవాదులు పాల్గొన్నారు.




Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com